


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 25-04-2025 | సంపుటి - 22 | సంచిక - 360 | రూ : 4 | పేజీలు: 8


## ఏడో బ్లాకు.. తొలగించాల్సిందే!

- మూడు బ్యారేజీల డిజైన్ల పునఃపరిశీలన అవసరం
- డిజైన్లు, నిర్మాణం, నాణ్యత, నిర్వహణలో లోపాలు
- రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్డీఎస్ఏ తుది నివేదిక

హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో అనేక లోపాలు చోటు చేసుకున్నాయని, డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ ఇలా ప్రతి అంశంలో వైఫల్యాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిందని, మూడు బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి డిజైన్ల ప్రామాణికాల విషయంలో సమగ్ర పునఃపరిశీలన చేయాలని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తుది నివేదిక స్పష్టం చేసింది. మూడు బ్యారేజీల దీర్ఘకాలిక మన్నిక, భద్రత దృష్ట్యా డిజైన్ల

తరువాయి 2లో





## చార్‌ధామ్ యాత్రకు ఉగ్ర భయాలు

- భక్తుల భద్రతపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం అప్రమత్తం

**ఢిల్లీ:** పహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదులు విరుచు కుపడిన నేపథ్యంలో చార్‌ధామ్ యాత్రకు వెళ్లే భక్తుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమ వుతున్నాయి. ఈ నెల 30న ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్ర ప్రారంభం కానుంది. ఈ యాత్ర కోసం ఇప్పటివరకు 19.95 లక్షల మందికిపైగా భక్తులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో సుమారు 17 వేల మంది విదేశీ యాత్రికులు. వీరందరి భద్రత విషయమై

తరువాయి 2లో

## వెంటాడుతాం.. వెన్నువిరుస్తాం..

### ఉగ్రవాదులకు కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తాం

**మధుబని:** జమ్మూకశ్మీర్‌లో అమాయకుల ప్రాణాలను హరించిన ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా వెతికి మరీ శిక్షిస్తామని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ముష్కరులకు, ఉగ్రవాదానికి మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్‌లోని మధుబనిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ హంతకులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. అనంతరం ప్రధాని ప్రసంగిస్తూ...‘‘ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు దేశమంతా అండగా ఉంది. ఉగ్రదాడి

తరువాయి 2లో



## పోప్ చివరి దర్శనం కోసం లక్షలమంది

పరిశుభ్రతకు గంట మాత్రమే చర్చి మూత

2లో



## పీపీపీ విధానంతో అభివృద్ధి వేగవంతం

- దాంతోనే స్వర్ణాంధ్ర సాధ్యం
- అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి:** రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులను పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్) విధానంలో చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు సాధించాలన్నా, పెట్టుబడులు భారీగా రావాలన్నా పీపీపీ విధానమే మార్గమని చెప్పారు.

తరువాయి 2లో






## ప్రపంచ దేశాలకు రోల్ మోడల్‌గా తెలంగాణ

- శాంతి, అహింస, న్యాయం, పెట్టుబడులే లక్ష్యంగా ‘భారత్ సమ్మిట్’
- భట్టి, ఉత్తమ్, గుర్‌దీప్ సింగ్ వెల్లడి
- నేడు, రేపు హెచ్ఐసీసీ నోవాటెల్‌లో సమ్మేళనం
- హైదరాబాద్‌కు చేరుకున్న వివిధ దేశాల ప్రతినిధులు

**హైదరాబాద్:** ప్రపంచ శాంతి, అహింస, న్యాయం, పెట్టుబడులే లక్ష్యంగా ‘భారత్ సమ్మిట్’ నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ నాయకుడు గుర్‌దీప్ సింగ్ సప్పల్ తెలిపారు. ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్ హెచ్ఐసీసీలోని

తరువాయి 2లో

## పర్యాటకులపై ఉగ్రదాడి గర్హనీయం

: సీఎం రేవంత్‌రెడ్డి

- నేడు కొవ్వొత్తుల ప్రదర్శన

**హైదరాబాద్:** జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి గర్హనీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన పర్యాటకులకు ఆత్మశాంతి కలగాలని ప్రార్థిస్తూ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం ముఖ్యమంత్రి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి

తరువాయి 2లో



## పహల్గాం దారుణాన్ని దేశం మరచిపోదు!

- ఉగ్రవాదులను నిర్దాక్షిణ్యంగా ఏరివేయాలి
- ఉగ్రదాడిలో చనిపోయిన కావలి వాసికి పవన్‌కల్యాణ్ నివాళి

2లో





## ముగిసిన వాన్స్ పర్యటన

జైపుర్: అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చేపట్టిన భారత పర్యటన గురువారం ముగిసింది. ఆయన తన భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో కలిసి గురువారం ప్రత్యేక విమానంలో వాషింగ్టన్‌కు తిరిగి వెళ్లారు. వాన్స్ కుటుంబం సోమవారం రాత్రి దిల్లీ నుంచి జైపుర్ చేరుకుంది. మంగళవారం ఆ విశిష్ట అతిథులు జైపుర్‌లోని అంబర్ కోటను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా వారు తాజ్‌మహల్ కూడా సందర్శించారు. వాన్స్ గత సోమవారం ఉదయం దేశ రాజధానిలోని అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శించిన అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు.

## ఏ నాయకుడూ ఎదుర్కోనన్ని సంక్షోభాలు ఎదుర్కొన్నా!

- ఆలోచనా విధానం మారితే అద్భుతాలు చేయొచ్చు
- ‘మైండ్‌సెట్ షిఫ్ట్’ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పుస్తక రచయిత పొంగూరు శరణిపై ప్రశంసల జల్లు కురిపించిన సీఎం

2లో



# వెంటాడుతాం.. వెన్నువిరుస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులపై జరిగిన దాడి మాత్రమే కాదు.. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన దుస్సాహసం'' అని పేర్కొన్నారు. 'ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది ప్రజలు విరిచేస్తారు'' అని ప్రధాని గట్టిగా హెచ్చరించారు. భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. ''మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా'' అని మోదీ స్పష్టం చేశారు.

### ప్రపంచానికి సూటి సందేశం

ప్రధాని మోదీ సాధారణంగా హిందీలో ప్రసంగిస్తుంటారు. మధుబని సభలో మాత్రం అరుదైన రీతిలో ఒక్కసారిగా తన ప్రసంగాన్ని హిందీ నుంచి ఆంగ్లంలోకి మార్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన సందేశాన్ని ప్రపంచ దేశాలకు సూటిగా చేరవేసేందుకు ఆంగ్లంలో ప్రసంగించినట్లు తెలుస్తోంది. ''ఈ రోజు బిహార్ గడ్డ నుంచి యావత్ ప్రపంచానికి ఒక విషయం స్పష్టం చేస్తున్నా. ఉగ్రవాదులను, వారికి అండగా నిలిచేవారిని భూమిపై ఎక్కడున్నా సరే వెంటాడుతాం. వారిని శిక్షించకుండా వదిలిపెట్టబోం'' అని ప్రధాని మోదీ ఆంగ్లంలో పేర్కొన్నారు.

### * గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

బిహార్‌లో రూ.13,500 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో దేశమంతా ఐక్యంగా ఉందని బిహార్ సీఎం నీతీశ్ కుమార్ తెలిపారు.

# ఏ నాయకుడూ
## ఎదుర్కోనన్ని సంక్షోభాలు ఎదుర్కొన్నా!

అమరావతి: 'మనమంతా జన్మతః సాధారణ వ్యక్తులమే. మనం ఆచరించే విధానాలు, సానుకూల దృక్పథమే ఉన్నత స్థానాలకు చేరుస్తుంది. నా జీవితంలో ఏ రాజకీయ నాయకుడూ చూడనన్ని సంక్షోభాలు చూశాను. ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకున్నాను. కాబట్టే ఈ స్థాయికి చేరుకున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ కుమార్తె, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోడలు పొంగూరు శరణి రచించిన 'మైండ్‌సెట్ షిఫ్ట్' పుస్తకాన్ని గురువారం విజయవాడలో సీఎం ఆవిష్కరించారు. తొలి ప్రతిని ప్రముఖ సినీ నటుడు చిరంజీవికి అందజేశారు. రొటీన్‌గా జరిగే పుస్తకావిష్కరణ కార్యక్రమానికి భిన్నంగా దీన్ని నిర్వహించారు. పుస్తకావిష్కరణ ముగిశాక రచయిత శరణి... చంద్రబాబు, చిరంజీవితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. శరణిపై సీఎం ప్రశంసల జల్లు కురిపించారు. ఇప్పటి వరకు వ్యక్తిత్వ వికాసం, ఆలోచనా విధానాల్ని మార్చుకోవడానికి 'ద సీక్రెట్' పుస్తకాన్ని చదవమని చెప్పేవాడినని, ఇకపై శరణి రాసిన పుస్తకాన్ని చదవమని చెప్పాల్సి వస్తుందన్నారు.

### * మీరింకా చిన్న పిల్లలే అనుకునేవాడిని..!

నేను మా నాన్నతోపాటు మీ దగ్గరకు వచ్చి నా పుస్తకాన్ని ఆవిష్కరించమని కోరినప్పుడు మీకు కలిగిన భావనేంటి? అని శరణి అడిగిన ప్రశ్నకు.. 'మీరింకా తండ్రిచాటు బిడ్డలే అనుకునేవాడిని. ఇంత పైకి వచ్చారని తెలిసి ఆశ్చర్యపోయాను. నేను 45 ఏళ్లపాటు ప్రాక్టీస్ చేసిన అంశాన్ని... నువ్వు చిన్న వయసులోనే ఆచరించడమే కాకుండా, మైండ్‌సెట్‌ను కొద్దిగా మార్చుకుంటే ఏదైనా సాధించగలమని చెబుతూ... అందరికీ ఉపయోగపడేలా పుస్తకమే రాశావు' అని చంద్రబాబు కొనియాడారు. 'నారాయణ స్థాపించిన విద్యాసంస్థలు ఒక బ్రాండ్. సాధారణ విద్యార్థుల్ని ఆయన దగ్గరకు పంపిస్తేనే మూడు నాలుగేళ్లలో మెరికల్లా మారుస్తారు. ఇక 24 గంటలూ ఇంట్లో ఉండే మిమ్మల్ని ఎలా వదులుతారు. ఆయన క్రమశిక్షణ, రుద్దుడు కార్యక్రమం... ఇక్కడ రుద్దడం అంటే (నవ్వుతూ) పర్ఫెక్ట్‌గా తయారు చేయడం. ఆయన అనుకున్నది సాధించేవరకు వదిలి పెట్టరు' అని సీఎం పేర్కొన్నారు.

### మైండ్‌సెట్ మార్చుకున్నా కాబట్టే ఈ స్థాయికి వచ్చా..!

'యూనివర్సిటీలో చదువుకుంటున్నప్పుడే రాజకీయ నాయకుడిని కావాలనుకున్నాను. మా వైస్‌ఛాన్స్‌లర్ పిలిచి లెక్చరర్ పోస్టు ఇస్తానన్నారు. వద్దని, ఎమ్మెల్యేగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని చెప్పాను. మంత్రి కావాలనుకొని సీఎం చెన్నారెడ్డిని అడిగితే... మొదటిసారి ఎమ్మెల్యే అయిన వెంటనే మంత్రి పదవా? అన్నట్టు చూశారు. నాకు మెరిట్ ఉంటేనే ఇవ్వండని చెప్పి వచ్చేశాను. రెండేళ్లలో మంత్రినయ్యాను. మనం ఒక అడుగు వేస్తే..మరో అడుగు కలిసి వస్తుంది' అని తెలిపారు. 'చిరంజీవి సాధారణ కుటుంబం నుంచి వచ్చి సంకల్పంతో, అకుంఠిత దీక్షతో ఈ స్థాయికి ఎదిగారు. ఎన్టీఆర్ కూడా ఎంతో కష్టపడి పైకి వచ్చారు. ఆయన విజయవాడలో చదువుకునేందుకు నాన్నమ్మతో కలసి ఇక్కడ ఒక గుడిసె వేసుకుని ఉండేవారట. ఒక రోజు గాలివాన వస్తే...గుడిసె కూలిపోతే మరో దారి ఉండదని, రాత్రంతా నిట్రాట పట్టుకుని కూర్చున్నారట. ఈ విషయం ఆయనే చెప్పారు. ఆయన రాజకీయాల్లో ఉన్నది 12 ఏళ్లే అయినా చరిత్ర సృష్టించారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్, అబ్దుల్‌కలాం వంటి వారంతా మైండ్‌సెట్‌తో గొప్పవాళ్లయినవారే' అని చంద్రబాబు పేర్కొన్నారు.

### ఆలోచనే నాది... ఆచరణ అధికారులదే..!

'మీరు అధికారులకు ఏఐ, మెషీన్ లెర్నింగ్ వినియోగంపై సదస్సు నిర్వహిస్తున్నారు కదా అది ఎంత వరకు ఉపయోగపడుతుందని అనుకుంటున్నారు. ప్రభుత్వంలో చాలా మంది పనిచేస్తుంటారు కదా... వారి మైండ్‌సెట్ మార్చడానికి మీరు ఏం చేస్తారు' అన్న ప్రశ్నకు.. 'మీ విద్యా సంస్థల్లో మీకు నచ్చిన ఫ్యాకల్టీని పెట్టుకుంటారు. ప్రభుత్వంలో అలా కుదరదు. ఉన్న అధికారులతోనే పని చేయించుకోవాలి. ఆలోచనే నాది. ఆచరణ అధికారయంత్రాంగానిదే. మా అధికారులందరికీ ఏఐలో శిక్షణ ఇచ్చేందుకు క్లాసులు పెట్టాం. ఎకోసిస్టమ్ సృష్టిస్తే పోటీ వాతావరణం దానంతట అదే మొదలవుతుంది' అని తెలిపారు.

# ఘనంగా సత్యసాయి ఆరాధనోత్సవం
## 'శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని యాత్ర' ప్రారంభం



పుట్టపర్తి : ప్రేమతత్వం, ఆధ్యాత్మిక సందేశాన్ని విశ్వమానవాళికి అందించిన సత్యసాయి.. కోట్ల మంది భక్తులను సేవా మార్గం వైపు నడిపించారని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు నాగానంద పేర్కొన్నారు. గురువారం శ్రీసత్యసాయి జిల్లా ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరంలో 15వ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. సత్యసాయి అవతార వైభవం, బోధనలు, సందేశం, సేవా స్ఫూర్తిని చాటి చెప్పేందుకు ఉద్దేశించిన 'శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని యాత్ర' ప్రచార రథాలను మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 2026 నవంబరు 26 వరకు యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. సత్యసాయి శతజయంతి వేడుకలను వందరోజులు నిర్వహిస్తామన్నారు. సాయి దేశీయ సంస్థల అధ్యక్షుడు నిమిష్ పాండే మాట్లాడుతూ..ప్రజలను సేవా మార్గం వైపు చైతన్యం చేసేందుకు యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

# పహల్గాం దారుణాన్ని దేశం మరచిపోదు!

నెల్లూరు: కావలి : 'పహల్గాంలో ఉగ్రవాదులు దారుణంగా దాడికి తెగబడ్డారు. పర్యాటకులనే లక్ష్యంగా చేసుకొని కిరాతకంగా చంపేశారు. ఈ ఘోరాన్ని దేశం ఎప్పటికీ మరిచిపోదు. ఉగ్రవాదులను నిర్దాక్షిణ్యంగా ఏరివేయాల్సిందే'నని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. మనకు మంచితనం, కనికరం ఎక్కువయ్యాయన్నారు. కశ్మీర్‌లో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి వాసి సోమిశెట్టి మధుసూదనరావు భౌతికకాయం గురువారం స్వస్థలానికి చేరుకోగా, పవన్‌కల్యాణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. సహచర మంత్రులు నాదెండ్ల మనోహర్, ఆనం రామనారాయణరెడ్డి, సత్యకుమార్‌లతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. సుమారు గంటకుపైగా వారితో మాట్లాడారు. అనంతరం మీడియాతో పవన్ మాట్లాడుతూ 'మధుసూదనరావు కుటుంబ సభ్యుల క్షోభను చూశాను. వారి ఆవేదన వింటుంటే మనసు వికలమైంది. మాట్లాడటానికి మాటలు రావడం లేదు. ఇదే ఘటనలో చనిపోయిన విశాఖకు చెందిన చంద్రమౌళి కుటుంబసభ్యులను కూడా కలుస్తాను. తర్వాత మంగళగిరిలో మీడియాతో అన్నీ వివరంగా మాట్లాడతాన'ని పవన్ అన్నారు. 'బాధిత కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు రాలేదని, వారికి భరోసా కల్పించేందుకు వచ్చామని పవన్ అన్నారు. మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ 'పర్యాటకులను పేర్లు, మతం అడిగి చంపడం బాధాకరం. 'ఏప్రిల్ 22 దేశ చరిత్రలో ఓ చీకటి రోజు' అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### హిందువులే లక్ష్యంగా ఉగ్రదాడి: పవన్ కల్యాణ్

విశాఖపట్నం, ఎంవీపీకాలనీ, జగదాంబ న్యూస్‌టుడే: 'పహల్గాం ఘటన హిందువులను లక్ష్యంగా చేసుకున్న దాడి అని స్పష్టంగా అర్థమవుతోంది. బాధిత కుటుంబాలతో ప్రత్యక్షంగా మాట్లాడినప్పుడు కడుపు తరుక్కుపోయింది. హిందువులా? ముస్లింలా? బొట్టు ఉందా? నువ్వు కల్మా చదవగలవా? లేదా అని తెలుసుకుని మరీ ఉగ్రవాదులు పర్యాటకులను చంపారు. ఇలాంటి ఘటనలు తలెత్తినప్పుడు దేశంలోని ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా బయటకొచ్చి జాతీయ సమగ్రతకు మద్దతు తెలపాలి... ఏకతాటిపైకి వచ్చి పోరాడాలి' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గురువారం ఆయన విశాఖ జడ్పీ కూడలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో భద్రపర్చిన చంద్రమౌళి భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం పాండురంగాపురంలోని చంద్రమౌళి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# పోప్ చివరి దర్శనం కోసం లక్షలమంది

వాటికన్: ప్రజా సందర్శన కోసం సెయింట్ పీటర్స్ బసిలికా చర్చిలో ఉంచిన పోప్ ఫ్రాన్సిస్ పార్థివ దేహానికి నివాళులర్పించడానికి ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాది మంది తరలి వస్తున్నారు. అనుకున్నదానికంటే ఎక్కువ మంది భక్తులు, అభిమానులు దర్శనం కోసం బారులు తీరుతుండటంతో సెయింట్ బసిలికా చర్చిని రాత్రంతా తెరచే ఉంచారు. గురువారం ఉదయం ఒక గంట మాత్రమే చర్చిని పరిశుభ్రం చేయడం కోసం మూసి ఉంచినట్టు వాటికన్ వర్గాలు తెలిపాయి. గత సోమవారం స్ట్రోక్ కారణంగా మరణించిన 88 ఏళ్ల పోప్ ఫ్రాన్సిస్ చివరి చూపు కోసం గంటల తరబడి మౌనంగా క్యూలో నిలబడ్డ భక్తులు తమకు ఆయనపై ఉన్న ప్రేమాభిమానాలను చాటుతున్నారు. వాటికన్ నగరంలోని కన్సిలియాజోన్ నుంచి సెయింట్ పీటర్స్ స్క్వేర్ మీదుగా బసిలికాకు చేరడానికి అనేక గంటలు పట్టినా ఖాతరు చేయకుండా నెమ్మదిగా ముందుకు సాగుతున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ లైన్లోనే నిలుచున్న ఎమిలియానో ఫెర్నాండెజ్ ''ఇక్కడ ఎంతకాలం వేచి ఉన్నానన్నది సమస్యే కాదు. ఎందుకంటే ఆయన పట్ల నా అభిమానాన్ని చూపడానికి ఇదే చివరి అవకాశం'' అన్నారు.

### ప్రపంచం ఆనందభరిత ప్రదేశం కావాలన్నదే పోప్ సందేశం

సాదాసీదా శవపేటికలో ఉంచిన పోప్ ఫ్రాన్సిస్ దేహాన్ని ప్రజా దర్శనం కోసం బుధవారం సెయింట్ పీటర్స్ బసిలికా చర్చికి తీసుకొచ్చారు. ఆయన అంత్యక్రియలు శనివారం జరగనున్నాయి. ''12 సంవత్సరాల పాటు పోప్ పీఠంపై ఉన్న ఫ్రాన్సిస్ పేదల పట్ల అవ్యాజమైన ప్రేమ కురిపించడంతోపాటు అన్ని వర్గాలనూ కలుపుకొని వెళ్లేలా పనిచేశారు. ఆ కారణంగా ఆయన ఛాందస వర్గాల నుంచి విమర్శలకు గురయ్యారు కూడా. ప్రపంచాన్ని ఆనందభరిత ప్రదేశంగా మార్చాలన్నదే ఆయన సందేశం'' అని సుదీర్ఘమైన లైన్లో ఫ్రాన్సిస్‌ను చివరిసారిగా చూసేందుకు గంటలుగా నిలబడివున్న మెక్సికన్ పౌరుడు రికార్డో ఒయోదా అన్నారు.

### జాతీయ జెండా అవనతం

పోప్ ఫ్రాన్సిస్ పట్ల గౌరవ సూచకంగా ఆయన అంత్యక్రియలు జరిగే శనివారం నాడు భారత్‌లో దేశ వ్యాప్తంగా అన్ని భవనాలపై జాతీయ జెండాను అవనతం చేస్తారు. ఆరోజు అధికారికంగా ఎలాంటి వినోద కార్యక్రమం నిర్వహించబోమని కేంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. తనువు చాలించిన పోప్ ఫ్రాన్సిస్ పట్ల గౌరవం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం మూడు రోజులు అధికారిక సంతాప దినాలుగా ప్రకటించిన విషయం విదితమే. దేశంలో ఈనెల 22, 23 తేదీల్లో సంతాప దినాలు పాటించారు. అంత్యక్రియలు జరిగే శనివారం నాడు చివరి సంతాప దినం పాటిస్తారు. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరు కానున్నారు.

# పీపీపీ విధానంతో
## అభివృద్ధి వేగవంతం

(మొదటిపేజీ తరువాయి)

సంస్కరణల్లో భాగంగా గతంలో పీపీపీ విధానాన్ని ప్రవేశపెట్టి మంచి ఫలితాలు రాబట్టామని సీఎం గుర్తుచేశారు. గురువారం సచివాలయంలో పీపీపీ విధానాన్ని విస్తృతం చేసే అంశంపై అధికారులతో ఆయన సమీక్షించారు. ''జాతీయ రహదారులను అనుసంధానించేలా రహదారుల నిర్మాణం చేపట్టడంతో పాటు పోర్టులు, వైద్యరంగం, పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పనలో పీపీపీ విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వం చేస్తున్న మొత్తం వ్యయంలో మూలధన వ్యయం వాటా మరింత పెంచేందుకు అది దోహదపడుతుంది. ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రాష్ట్రాలు పీపీపీ ప్రాజెక్టులను రూపొందించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భూ కేటాయింపులు, అనుమతుల్లో ఆలస్యం, వివాదాలు పరిష్కరించకపోవడం వంటి ఇబ్బందులను అధిగమించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు.

# పర్యాటకులపై ఉగ్రదాడి గర్హనీయం

(మొదటిపేజీ తరువాయి)

విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఉగ్రదాడులు, తదనంతర పరిణామాలు, ప్రస్తుతం అక్కడి పర్యాటకుల పరిస్థితిపై ముఖ్యమంత్రి చర్చించారు. పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాలని ఏఐసీసీ పిలుపునివ్వడంతో.. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన ర్యాలీ వాయిదా పడింది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నెక్లస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రజలు, శాంతికాముకులు పెద్దఎత్తున తరలివచ్చి మృతుల కుటుంబాలకు నివాళులర్పించాలని పీసీసీ ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేసింది.

# ప్రపంచ దేశాలకు
## రోల్ మోడల్‌గా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

నోవాటెల్ హోటల్‌లో జరగనున్న భారత్ సమ్మిట్ ఏర్పాట్లను వారు గురువారం పర్యవేక్షించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 'జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన అలీన విధానంతో భారతదేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీగా కాంగ్రెస్ నిలబడింది. ప్రపంచంలోని ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో నెహ్రూ ఆలోచనలు, అలీన విధాన స్ఫూర్తితో, రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు ఇప్పుడు కాంగ్రెస్ ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తోంది. వందకు పైగా దేశాల నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరిలో ప్రభుత్వాధినేతలు, పార్లమెంటు సభ్యులు, తత్వవేత్తలు, కార్పొరేట్ ప్రతినిధులు, మేధావులు, పెట్టుబడిదారులు ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆలోచనలు, పెట్టుబడులకు అనువైన వనరులను తెలియచేసే ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశాం. ఆయా దేశాలకు ఇవి రోల్‌మోడల్ అవుతాయని భావిస్తున్నాం. ప్రతినిధులను శనివారం ఉదయం ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌జీఎస్) అమలును చూపించేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకువెళ్తాం. శనివారం సాయంత్రం వారు శిల్పకళా వేదికలో ఇందిరా మహిళాశక్తి బజార్‌ను సందర్శిస్తారు. కశ్మీరులో ఉగ్రదాడి జరిగిన పహల్గాంను సందర్శించనున్న రాహుల్ గాంధీ.. అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకుంటారు'' అని భట్టి వివరించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న సానుకూలతలను వివరిస్తాం. కశ్మీర్‌ను ఆర్థికంగా దెబ్బతీయాలని చేసిన ఉగ్రదాడిని ఖండిస్తున్నాం. భారతదేశంలో విభేదాలను పక్కనపెట్టి అందరూ ఏకం కావాల్సిన సమయమిది. ఈ విషయంలో భారత ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ తప్పిదాలు ఉన్నమాట వాస్తవం'' అన్నారు. గుర్‌దీప్ సింగ్ సప్పల్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా ప్రజాస్వామ్యం, రాజ్యాంగం మీద దాడులు జరుగుతున్నాయి. పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ సమ్మిట్‌లో కళా, సాంస్కృతిక, వినోద తదితర అనేక కార్యక్రమాలను తగ్గించుకున్నాం. సమావేశాల్లో పలు తీర్మానాలు కూడా చేస్తాం' అని తెలిపారు. సమ్మిట్‌లో తెలంగాణను ప్రపంచానికి రోల్ మోడల్‌గా చూపుతామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### పలు అంశాలపై చర్చాగోష్ఠులు

'భారత్ సమ్మిట్'లో జరిగే చర్చాగోష్ఠుల్లో వివిధ దేశాల ప్రతినిధులతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, సల్మాన్‌ఖుర్షీద్, కేసీ వేణుగోపాల్ తదితరులు ప్రసంగించనున్నారు. సమ్మిట్ ఏర్పాట్లను కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గుర్‌దీప్ సింగ్, శ్రీధర్‌బాబు, మహేశ్‌కుమార్‌గౌడ్, విశ్వనాథ్, రాజగోపాల్‌రెడ్డి, మధుయాస్కీగౌడ్ తదితరులు గురువారం సాయంత్రం పరిశీలించారు. సమ్మిట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రధానహాలులో వేదికపై గాంధీ విగ్రహం పెట్టారు. హాలులో ఇరువైపులా మహాత్మాగాంధీ, భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్, మౌలానా ఆజాద్, డా.బాబూ రాజేంద్రప్రసాద్ తదితర 40కి పైగా నేతల చిత్ర పటాలు ఏర్పాటు చేశారు. సమ్మిట్‌లో పాల్గొనడానికి వివిధ దేశాల ప్రతినిధులు గురువారం హైదరాబాద్ చేరుకోగా.. విమానాశ్రయంలో వారికి ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు.

# చార్‌ధామ్ యాత్రకు ఉగ్ర భయాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తరాఖండ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రత్యేకంగా దృష్టి సారించి ముందస్తు జాగ్రత్తలకు ఉపక్రమించింది. భక్తుల ప్రయాణం, దర్శనం సజావుగా, సురక్షితంగా సాగేలా ఏర్పాట్లు చేస్తోంది. చార్‌ధామ్ యాత్రకు వెళ్లటానికి పేర్లు నమోదు చేసుకున్న విదేశీయుల్లో అమెరికా, బ్రిటన్, మలేసియా, నేపాల్, ఆస్ట్రేలియాతో సహా 103 దేశాల పౌరులు ఉన్నారు. పర్యాటక శాఖ సమాచారం ప్రకారం, కేదార్‌నాథ్‌కు 6,100 మంది, బద్రీనాథ్‌కు 4,800, గంగోత్రికి 3,150, యమునోత్రికి 2,750 మంది విదేశీ యాత్రికులు పేరు నమోదు చేసుకున్నారు.

# ఏడో బ్లాకు తొలగించాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

పునఃపరిశీలన తప్పనిసరని పేర్కొంది. మేడిగడ్డ ఏడో బ్లాక్‌కు జరిగిన నష్టాన్ని పరిశీలిస్తే తిరిగి బాగు చేయడం సాధ్యం కాదని, ఇక్కడ గేట్లు నిర్వహించడానికి వీలులేదని, ఈ బ్లాకును పూర్తిగా తొలగించి మిగిలిన బ్లాకులకు నష్టం జరగకుండా చూడాలని స్పష్టం చేసింది. ఆయా బ్లాకుల పటిష్ఠతపైనా సమగ్ర పరిశీలన చేయాలంది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో నాణ్యత, డిజైన్ లోపాల వల్ల కొన్ని చోట్ల స్ట్రక్చరల్ సమస్యలు వచ్చాయని వెల్లడించింది. బ్యారేజీల నిర్మాణ సమయంలో ప్రాజెక్టు మౌలికాంశాలకు సంబంధించి అనేక మార్పులు జరిగాయని, జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్ జరగకుండానే బ్యారేజీల నిర్మాణ స్థలాలను మార్చారని తెలిపింది. మేడిగడ్డ ఏడో బ్లాక్ కుంగడానికి ప్రధాన కారణం సీకెంట్ పైల్స్ నిర్మాణంలో మార్గదర్శకాలు పాటించకపోవడమేనని, సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకుండా బ్యారేజీ ఎగువ, దిగువ కట్ ఆఫ్ వాల్స్ స్ట్రక్చరల్ ఇంటెగ్రిటీ విషయంలో రాజీ పడినట్లయ్యిందని వెల్లడించింది. బ్యారేజీలకు మరింత నష్టం వాటిల్లకుండా నివారించేందుకు వాటి పటిష్ఠత, భద్రతపై సమగ్ర పరిశోధన జరగాలని ఎన్డీఎస్ఏ తుది నివేదికలో స్పష్టం చేసింది. ఈ నివేదికను ఎన్డీఎస్ఏ ఛైర్మన్ అనిల్‌జైన్ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపారు. అందులోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

### మధ్యంతర సిఫార్సుల అమలులో జాప్యం

''2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ కుంగడంతో దీనిపై అధ్యయనం చేయాలని 2024 ఫిబ్రవరి 13న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ ఛైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ ఆధ్వర్యంలో 2024 మార్చి 2న నిపుణుల కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ మధ్యంతర నివేదిక ఇచ్చి పలు పరీక్షలు చేయించాలని సూచించింది.

# ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని స్తంభింప చేస్తాం

* **సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్**
* **సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలు కుండలతో నిరసన**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో మంచినీరు డ్రైనేజీ, కోతుల, కుక్కల బెడద వంటి స్థానిక సమస్యలు పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని స్తంభింప చేస్తామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ హెచ్చరించారు. మున్సిపాలిటీలో కిన్నెరసాని మంచినీరు ప్రతిరోజు విడుదల చేయాలని ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇవ్వాలని వార్డులో డ్రైనేజీలు శుభ్రం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక సింగరేణి హెడ్ ఆఫీస్ పార్కు నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ఖాళీ బిందెలు, కుండలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ మాట్లాడుతూ కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో సిపిఎం సర్వే నిర్వహించిందని ఇందులో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. ప్రధానంగా మంచినీళ్ళ సమస్యతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు కిన్నెరసాని నీరు 15 రోజులకు ఒకసారి చుట్టం చూపున రావడంతో ఒక కిలోమీటర్ దూరం వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు వేసవికాలం వచ్చి ప్రజలు మంచినీళ్ల కోసం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. అన్ని రకాల అర్హతలు ఉండి కొత్త పెన్షన్లకు దరఖాస్తులు చేసుకుంటే నేటికీ దరఖాస్తులు మంజూరు చేయకుండా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆయన ఆరోపించారు. కోతులు కుక్కల బెడద నుండి ప్రజలు భయభ్రాంతులకు గురవుతుంటే అవి కరిచి గాయాల పాలవుతున్న మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్లుగా కూడా లేదని ఆయన విమర్శించారు. మున్సిపల్ అధికారులకు ఇంటి పనులు వసూలు చేసి ఖజానా నింపుకోవడంలో ఉన్న ధ్యాస మున్సిపాలిటీ అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారంపై లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి కూడా జీరో కరెంట్ బిల్లు రావడం లేదని దీనినీ అధికారులు పరిశీలన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరుతో ప్రజల దగ్గర దరఖాస్తులు తీసుకొని వార్డు సభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేశారని కానీ నేటికీ లబ్ధిదారులను గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు. అధికారులు రహస్యంగా లబ్ధిదారులు ఎంపిక చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని అర్హులకు ఇల్లు కేటాయించకున్న అన్యాయం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరిక చేశారు వార్డు సభల ద్వారానే లబ్ధిదారులు ఎంపిక జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్తగూడెం పట్టణ ప్రజల చిరకాల కోరిక అయిన క్రమబద్ధీకరణ పట్టాల సమస్య పరిష్కారం చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని ఆయన విమర్శించారు. క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ తమ రాజకీయ అధికారం కోసం ప్రచార కార్యక్రమంగా ఉపయోగించుకుంటున్నారు తప్ప చిత్తశుద్ధితో పట్టాల పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు క్రమబద్ధీకరణ పట్టాలు లేకపోవడం వలన ప్రభుత్వం పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిబంధన వలన ఇందిరమ్మ ఇంటి పథకానికి దూరం అవుతున్నారని ఆయన ఆరోపించారు. మున్సిపల్ అధికారులు మరియు రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు... స్పందించిన మున్సిపల్ అధికారులు...సుమారు రెండు గంటల పాటు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడంతో మున్సిపల్ డి ఈ శ్రీనివాస్, మేనేజర్ ప్రసాద్ లు ధర్నా వద్దకు వచ్చి ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు తీసుకొని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కిన్నెరసాని మంచినీటి సమస్య వారం రోజుల్లో పరిష్కారం చేసి ప్రతి ఇంటికి నల్ల కనెక్షన్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. మంచినీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. పెన్షన్లు గృహ జ్యోతి సమస్యను వ్యక్తుల వారీగా పరిశీలన చేసి ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తమ పరిధిలో లేకపోతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు డి వీరన్న, సందుకూరి లక్ష్మి, నందిపాటి రమేష్ టౌన్ కమిటీ సభ్యులు, జునుమాల నగేష్, ఆలేటి శ్రీను, నాగకృష్ణ సీనియర్ నాయకులు, కే హెచ్ ప్రసాద్, ఎన్ఎస్ రాజు, కొలిపాక వెంకటేశ్వర్లు, నాయకులు కుక్కల ముతేష్, శివ, గిరి, రమ, రామ్ చరణ్, సాహేబి, వెంకటేష్, మరియా తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కార్మికులకు అండగా ఉంటా

* **ఉప్పల్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మల్లాపూర్ డివిజన్ లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ మొదటి వార్షికత్సవ జెండా ఆవిష్కరణ కార్యక్రమము యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వచ్చి జెండా ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతు ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో పనిచే సే నాన్ టీచింగ్ స్టాఫ్, డ్రైవర్లు, స్వీపర్లు, అటెండర్లు తదితర కార్మికులకు యాజమాన్యం తో మాట్లాడి మెరుగైన వేతన ఒప్పందం చేస్తామని, ఆరోగ్య భీమా సౌకార్యం కల్పించడానికి కృషి చేస్తానని, అన్ని రకాల సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు,కార్మికులకు స్థానిక సమస్యలు కూడా పరిస్కరిస్తమని తెలిపారు.యూనియన్ అధ్యక్షులు వేముల మారయ్య మాట్లాడుతు కార్మికులకు అందుబాతులో ఉంటూ ఎమ్మెల్యే సహకారంతో సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, డిపిఎస్ స్కూల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మధుగౌడ్, నాయకులు నగేష్, రాందాస్, అశోక్,రజిత, స్వర్ణలత, నాగమణి,బీఆర్టీయూ నాయకులు రామాంజనేయులు,సాతం రమేష్, మారుతీరావు, యాకస్వామి పాల్గొన్నారు.

## ఆటలు స్నేహ భావాన్ని, ఐక్యతను పెంచుతాయి

* **టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఆటలు ఆరోగ్యంతో పాటు అందరిలోనూ స్నేహ భావాన్ని, ఐక్యతను పెంపొందించి దురలవాట్లను దూరం చేస్తాయని, శక్తి సామర్థ్యాలను కలిగించడంతో పాటుగా మానసిక స్థైర్యం, ధైర్యం పెంపొందిస్తాయని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. గురువారం పాల్వంచ మండలం దంతెలబోర ప్రీమియర్ లీగ్ పోటీల విజేతలు మొదటి బహుమతి ములకలపల్లి మండలం, 2వ బహుమతి బూర్గంపహాడ్ మండల జట్లకు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతు మద్యపానం, ధూమపానం వంటి ప్రమాదకరమైన వాటికి బానిస కాకుండా దేశానికి వెన్నెముకగా యువత శక్తివంతంగా కావాలని అన్నారు. మన ఊరు మన ఆట పేరిట ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్న క్రీడా నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు ఎండి కరీం పాషా,ఓబిసి కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు జయప్రకాష్,ఓబీసీ నాయకులు బొబ్బాల.వెంకట్ యాదవ్,సోషల్ మీడియా సాయిచంద్,సాయి ప్రకాష్, స్థానిక నాయకులు, పోటీల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి..

* **యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి..**
* **జిల్లా స్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమావేశం లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెంను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు వినియోగం లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించకుండా ఉండేలా కళాశాల యజమాన్యాలు, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. విద్యా సంస్థల్లో నిర్వహించే పేరెంట్స్ టీచర్ సమావేశాల్లో డ్రగ్స్, గంజాయి వినియోగం వల్లే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యదార్థ సంఘటన ఆధారంగా వారి భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం చూపడుతుందో వీడియోల ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్పోస్టుల ద్వారా నిరంతరనిగా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆలోచన విధానం, ఆలోచన శక్తి నశిస్తాయన్నారు. భావితరాలు మాదకద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు, రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారికి రక్తం అవసరమవుతుందని, కాబట్టి పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో డిఎస్పి శరత్, అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కరంచంద్, ఎక్సైజ్ సీఐ జానయ్య, డ్రగ్ ఇన్స్పెక్టర్ సంపత్, కొత్తగూడెం ఆర్ టి ఓ వెంకటరమణ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అతి తక్కువ కాలంలో ఎక్కువ వ్యతిరేకత ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

* **టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి**



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : అతి తక్కువ కాలంలో ఎక్కువమంది ప్రజలతో విమర్శ ఎదుర్కొంటున్న ఏకైక ప్రభుత్వంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలోనే రికార్డ్ సాధించిందని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి విమర్శించారు. గురువారం రాజాపేటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదగిరిగుట్ట ఏసిపి, రూరల్ సీఐలు వ్యవహరిస్తున్న తీరుతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. త్వరలోనే ప్రతి మండలంలో పదిమంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసుకొని టిఆర్ఎస్ కార్యకర్తలను కాపాడుకుంటూ పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను ప్రతిఘటిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 420 హామీలతో గద్దెనెక్కి 6 గ్యారంటీలను అటకెక్కించి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని నాట్లు వేసే సమయంలో ఇవ్వాల్సిన రైతుబంధు ఓట్లు వేసే సమయంలో ఇస్తూ రైతులను మోసం చేస్తున్నాడన్నారు. అన్నివర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. కోర్టులు మొట్టికాయలు వేసినప్పటికీ రేవంత్ రెడ్డి మారడం లేదని అన్నారు. ఈనెల 27వ, తేదీన వరంగల్ లో జరిగే పార్టీ 25వ, సిల్వర్ జూబ్లీ సభలో కెసిఆర్ ప్రసంగం కోసం యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని మహేందర్ రెడ్డి చెప్పారు. మాట ఇస్తే మడమతిప్పని నాయకుడిగా కెసిఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, వరంగల్ సభకు 15 లక్షల కు పైగా ప్రజలు హాజరు స్వచ్ఛందంగా కానున్నారని తెలిపారు. రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ ప్రజలతో సన్నబియ్యం ఇస్తున్నామంటూ భోజనం చేయడం కాకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరిస్తే టిఆర్ఎస్ పార్టీ కూడా సామూహిక భోజన కార్యక్రమంలో పాల్గొంటుందని అన్నారు. రాజపేట మండలం నుండి 20 బస్సులు 100 కార్ల లో టిఆర్ఎస్ పార్టీ సభకు అన్ని గ్రామాల అన్ని వర్గాల ప్రజలు తరలిరానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల శాఖ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ మాజీ జెడ్పిటిసి చామకూర గోపాల్, ప్రజా ప్రతినిధుల ఫోరం జిల్లా అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, రాజపేట పట్టణ శాఖ అధ్యక్షులు బెడిదే వీరేశం, రాజపేట పాల సొసైటీ చైర్మన్, టిఆర్ఎస్ పార్టీ మండల సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుంటి కృష్ణ, యువజన విభాగం అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్, మాజీ సర్పంచ్ లు రామిండ్ల నరేందర్, ఠాగూర్ ధర్మేందర్ సింగ్, రామచంద్ర రెడ్డి, బాలయ్య, కటకం స్వామి, ఇప్ప వెంకటయ్య, చెరుకు కనకయ్య, కోటగిరి పాండరి, చింతల ఉప్పలయి, కర్రే కనకయ్య, బిళ్ళకుదురు రాజు, సందిల వెంకటేష్ తదితరులున్నారు.

## చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లకు ఘన సన్మానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియామకమైన ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్ లను గ్రామీణ కళల పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఇటీవల పదవి విరమణ పొందిన ఎం వి చారి, నూతన బార్ అసోసియేషన్ చైర్మన్ గా ఎన్నికైన బాల్యం వెంకటాచలపతిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ కళల పరిరక్షణ సేవా సమితి వ్యవస్థపాక అధ్యక్షుడు ముప్పిడి సైదులు గౌడ్, అధ్యక్షుడు గ్యార కిష్టయ్య, గౌరవ సలహాదారులు దొడ్డి రాములు, డైరెక్టర్ బొడిగె ప్రభాకర్, కురుమిద్దె గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 94 కేజీల.. ఎండు గంజాయి పట్టివేత



దుండిగల్, ప్రజాస్ఫూర్తి: 94 కేజీల గంజాయిని పట్టుకున్నారు దుండిగల్ పోలీసులు. మేడ్చల్ ఏసిపి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో దుండిగల్ పీఎస్ లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం ప్రకారం దుండిగల్ పోలీసులు ఓఆర్ఆర్ వద్ద తనికీలు నిర్వహించగా రెండు వాహనాలలో ఒరిస్సా రాష్ట్రం, సుక్మా జిల్లా నుండి షేక్ మునావర్(24), ఘంటసాల జగదీష్(19)తో పాటు దేవా సచిన్ లు 94 కేజీల ఎండు గంజాయి కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా ప్రాంతానికి తరలిస్తున్నారు. కాగా దుండిగల్ పోలీసులు మునావర్, ఘంటసాల జగదీష్లను పట్టుకొని విచారించగా వారి నుండి 94 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి దేవా సచిన్ పరారీలో ఉన్నాడు. గజాయి విలువ మార్కెట్ లో 33 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

## సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

* **బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద జీడిమెట్ల డివిజన్ శ్రీ రాఘవేంద్ర కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ ఒక్కతాటిపై ఉంటూ ఐకమత్యంతో పని చేసినప్పుడే ఆ కాలనీ వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు.

# బేగంపేట్‌లో ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ కొత్త ఔట్‌లెట్ ప్రారంభం





**హైదరాబాద్, 24 ఏప్రిల్ 2025 (ప్రజాస్ఫూర్తి):** భారతదేశంలోని మొట్టమొదటి ఆర్గానిక్ క్రీమరీ ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్, బేగంపేట్‌లో తమ మూడో ఔట్‌లెట్‌ను గ్రాండ్‌గా ప్రారంభించింది. రూ. 1కే గ్రాము ఆర్గానిక్ ఐస్ క్రీం అందిస్తున్న ఈ స్టోర్‌ను సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, పోలీస్ అధికారులు, జర్నలిస్ట్ స్వప్న ప్రారంభించారు. 2013లో స్థాపితమై, 2018 నుంచి పూర్తిగా ఆర్గానిక్‌గా మారిన ఐస్‌బర్గ్, A2 దేశీ ఆవు పాలు, బెల్లం, కొబ్బరి చక్కెర వంటి సహజ పదార్థాలతో ప్రిజర్వేటివ్ రహిత ఐస్ క్రీమ్‌లను అందిస్తోంది. 40+ ఆర్గానిక్ టాపింగ్స్, డెత్ బై చాక్లెట్ సండే, ఆర్టిసానల్ కేక్స్‌తో కస్టమర్లను ఆకర్షిస్తోంది. బేగంపేట్ ఔట్‌లెట్ లగ్జరీ లాంజ్ కాన్సెప్ట్‌తో ప్రీమియం డెజర్ట్ అనుభవాన్ని అందిస్తుంది. 100+ సేంద్రీయ రైతులతో భాగస్వామ్యంతో నాణ్యమైన పదార్థాలను సేకరిస్తూ, ఐస్‌బర్గ్ హైదరాబాద్‌లో KPHB, మాదాపూర్ స్టోర్స్‌తో సహా దేశవ్యాప్తంగా 72 ఔట్‌లెట్స్‌లో సేవలు అందిస్తోంది. ఫౌండర్ సుహాస్ మరిన్ని స్టోర్స్‌తో విస్తరణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## క్రికెట్ కోచింగ్ స్టేడియాన్ని ప్రారంభించిన ఎంపీఆర్



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా ఏళ్ల రెడ్డి గూడ లో బ క్రికెట్ కోచింగ్ స్టేడియాన్ని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. టర్నింగ్ పాయింట్ క్రికెట్ ఆరిన అకాడమీ, శ్రీనివాస్ యాదవ్,రాకేష్ యాదవ్ ఆధ్వర్యంలో క్రికెట్ మైదానాన్ని ఏళ్ల రెడ్డి గూడ లో ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన మైదాన ప్రారంభోత్సవానికి పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కొబ్బనూరి నాగశేషు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పూర్ణయాదవ్, డివిజన్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జి అరుణ్ కిరణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి,సాయికిరణ్ యాదవ్, జి సత్యనారాయణ,టి శ్రీహరి, మనోజ్ కుమార్, సంతోష్ చారి, కొబ్బనూరి నాగరాజు, నాగరాజు యాదవ్, నరేందర్ గౌడ్,శ్రీకాంత్ గౌడ్, శివకుమార్,సురేందర్ రెడ్డి, సోమనాథ్, ప్రదీప్, సిద్ధిక్, వినోద్, అహ్మద్, ఈశ్వర్ యాదవ్, మల్లికార్జున యాదవ్, సుధాకర్ యాదవ్, అల్లాడి కుమార్ యాదవ్, సతీష్ యాదవ్, ఉప్పల్ అవినాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు

*** కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : చెరువుల అభివృద్ధి విషయంలో కూడా రాజీ పడే ప్రసక్తే లేదని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైడ్రా కమిషనర్ రంగనాథుని కలిశారు.. ఈ నేపధ్యంలో గురువారం హైడ్రాధికారులు కూకట్పల్లి నియోజకవర్గం లోని నల్లచెరువు,కాముని చెరువు, సున్నం చెరువు ప్రాంతంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గం లోని 9 చెరువులను అభివృద్ధిపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఉంటున్న ప్రజలకు, ఆ ప్రాంతంలో కొనుగోలు చేసిన వారికి, పట్టాదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వారికి తగిన న్యాయం చేయాలన్నారు. ఎవరైతే ప్రజలు స్థానికంగా కొనుక్కున్నవారును, పట్టాదారులకు తగిన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టిడిఆర్ విషయంలో వారికి భరోసా ఇచ్చే విధంగా అధికారులతో మాట్లాడి సమస్యను కొలిక్కి తీసుకురావడం జరిగింది.. ప్రజల చేత మూడు పర్యాయాలు ఎన్నుకున్న కృతజ్ఞతా భావంతో ఎవరికీ కూడా ఇబ్బంది కలగకుండా న్యాయం చేసే విధంగా వారికి అండగా ఉంటానన్నారు. చెరువులు అభివృద్ధి విషయంలో కూడా రాజీ పడే ప్రసక్తే లేదని, ఎవరికీ నష్టం లేకుండా చెరువులను అభివృద్ధి పరచాలని అధికారులకు తెలపడం జరిగిందని ఆయన అన్నారు.

## తెలంగాణలో మరింత పెరగనున్న ఎండల తీవ్రత

హైదరాబాద్: తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 23 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంది. చాలా జిల్లాల్లో రాత్రిపూట వేడి వాతావరణం మరింత ఎక్కువగా ఉండనుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్ర, శనివారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే వీలుందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.

## సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

*** పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 1, ఆల్విన్ కాలనీ ఫేస్ 2, తులసి నగర్, శ్రీ తులసి నగర్, కాకతీయ నగర్, చంద్రమ్మ బస్తీ, పంచమి కాలనీ, ఉజ్జయిని మహంకాళి నగర్ కాలనీలలో రూ. 2 కోట్ల 8 లక్షల 50 వేలతో అంచనావ్యయం తో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణము పనులకు ఆయన తో పాటు స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం, కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం 2 కోట్ల 8 లక్షల 50 వేల రూపాయల తో ఆల్విన్ కాలనీ ఫేస్ 1, ఆల్విన్ కాలనీ ఫేస్ 2, తులసి నగర్, శ్రీ తులసి నగర్, కాకతీయ నగర్, చంద్రమ్మ బస్తీ, పంచమి కాలనీ, ఉజ్జయిని మహంకాళి నగర్ కాలనీల లో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీ వాసులకు ఉపశమనం లభించిందన్ఆనరు. మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదన్నార. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఉగ్రదాడిపై భగ్గుమన్న చర్లపల్లి డివిజన్ బిజెపి



కుషాయిగూడ బస్ స్టాప్ సమీపంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం.కాప్రా,ప్రజాస్ఫూర్తి : జమ్ముకశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై యావత్ దేశం భగ్గుమంటుంది. పర్యటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని జిహెచ్ఎంసి, చర్లపల్లి డివిజన్ భారతీయ జనతా పార్టీ ముక్తకంఠంతో ఖండించారు. ముష్కరుల దాడికి నిరసనగా కుషాయిగూడ బస్ స్టాప్ సమీపంలో బిజెపి పార్టీ డివిజన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్ ఆధ్వర్యంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను ఊరేగించి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చల్లా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఉగ్రవాదానికి భారత్ లొంగదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారని చెప్పారు. పహల్గాంలో పర్యటకుల హత్యకు కారణమైనవారిని వదిలి పెట్టొద్దని స్పష్టం చేశారు. బుధవారం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు డి నాదం, ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎం లక్ష్మణ్ గౌడ్, రాష్ట్ర నాయకులు కొమ్ము నర్సింగ్ రావు, కంటెస్టెడ్ కార్పొరేటర్ కే సురేందర్ గౌడ్, ఎమ్ గణేష్ ముదిరాజ్, టి ఆనంద్ గౌడ్, రేగొండ వెంకటేశ్వర్లు, గణేష్ గౌడ్, పి రాజు ముదిరాజ్, నాగమణి, ఎన్ జనార్దన్, బి శ్రీనివాస్ ముదిరాజ్, కే యాదయ్య, ఏ సుధాకర్, రాజేష్ వంశరాజు, శంకర్ వంశరాజు, కే విద్యాసాగర్, పవన్ కుమార్, సి హెచ్ శ్రీకాంత్, నాగపురి నవీన్, వెంకటేష్ యాదవ్, బండారి అనిల్, రత్నపురం వెంకటేష్, అప్పి నాయి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఆపరేషన్.. 1000 మంది మావోయిస్టులను చుట్టుముట్టిన 20వేల బలగాలు..!



చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో అతిపెద్ద యాంటీనక్సల్ ఆపరేషన్ కొనసాగుతోంది. బీజాపూర్ అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. దాదాపు 1000 మంది మావోయిస్టులను సుమారు 20వేల మంది భద్రతా సిబ్బంది చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే కర్రెగుట్టల కేంద్రంగా అగ్రనేతలు, మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఉన్నారనే సమాచారంతో కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్రెగుట్టలలో దాదాపు 1000 మంది మావోయిస్టులు దాగి ఉన్నట్లు సమాచారం. అగ్రనేత హిడ్మా నేతృత్వంలో వీరంతా అక్కడకు చేరినట్లు తెలుస్తోంది. వీరిలో కమాండర్ స్థాయి నేతలు, మావోయిస్టు అగ్ర నాయకులు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఈ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. భీమవరంపాడు, పూజారీ కాంకేర్, పామేడు అటవీ ప్రాంతాల్లో కాల్పుల మోత మోగుతోంది. కూంబింగ్ నేపథ్యంలో కర్రెగుట్ట దండకారణ్యంలోని పలు గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. గాలింపు చర్యల్లో డీఆర్‌జీ బస్తర్ ఫైటర్ కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్ సైనికులతో పాటు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు పాల్గొన్నారు. 48 గంటలుగా ఈ కూంబింగ్ కొనసాగుతోంది. మందుపాతరలు అమర్చామని ఇప్పటికే మావోయిస్టులు లేఖల ద్వారా ప్రకటించారు. ప్రజలెవరూ అటవీ ప్రాంతంలోకి రావొద్దని హెచ్చరించారు. దీంతో గాలింపు అత్యంత అప్రమత్తంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 3 వేల మందితో కూంబింగ్ చేపట్టగా.. గురువారం ఉదయం అదనంగా మరో 2 వేల మందిని రప్పించారు. దీంతో ఈ 5 వేల మంది భద్రతా సిబ్బంది కర్రెగుట్టల అటవీప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు సమాచారం. అయితే, భద్రతా బలగాల సంఖ్య 20వేల వరకు ఉంటుందని పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. బస్తర్, అబూజ్‌బడ్ దండకారణ్యంపై హిడ్మాకు పూర్తి అవగాహన ఉంది. అతడి టార్గెట్‌గానే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సమాచారం. హిడ్మాతో పాటు మావోయిస్టు బెటాలియన్ చీఫ్ దేవాను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది.

## చెట్లను మనం కాపాడితే.. అవి మనలను కాపాడతాయి

**: మొక్కల సాంబయ్య**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: చెట్లను మనం కాపాడితే.. అవి మనలను కాపాడతాయని మన పెద్దలవాక్కు. అందుకే వృక్షో రక్షతి రక్షితః అని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కల్ని నాటాలని ఖమ్మం జిల్లా ఏన్కూరు కు చెందిన మొక్కల సాంబయ్య పేర్కొంటున్నారు.. మనము మొక్కలు నాటకపోతే భవిష్యత్తు లో ప్రతిఒక్కరూ ఆక్సిజన్ సిలిండర్ వీపున వేసుకోని తిరగాల్సిన పరిస్థితి వస్తుందని అలా జరగకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాల్సిందిగా అయిన విజ్ఞప్తి చేస్తున్నారు..

## సుగుణారావు దంపతులకు సన్మానం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లందులో జరిగిన ప్రకృతి ఆరోగ్య మహాసభలలో, కొత్తగూడానికి చెందిన ప్రకృతి ఆశ్రమం కోఆర్డినేటర్, నాచురోపతి ప్రాక్టీషనర్ సుగుణారావు శోభారాణి దంపతులను అతిధులు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఆయన ఆల్టర్నేటివ్ తెరపిస్టుగా, ప్రకృతి వైద్యం, ఆక్యుపంచర్ సైన్స్, ఆక్యుప్రెషర్ థెరపీ, ఖైరో ప్రాక్టీస్ (మర్మకళ) ఆయుర్వేదం మొదలైన వైద్య విధానాల ద్వారా అనేక జబ్బులను తగ్గిస్తుండట మే కాకుండా, వైద్య విధానాలను సాధారణ ప్రజల వరకు చేరవేస్తున్నాడటంతో వారిని సన్మానించారు. సన్మానించిన వారిలో ప్రముఖ ప్రకృతి కవి డాక్టర్ జయరాజు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, డి.ఎస్.పి చంద్రభాను, మాజీ మున్సిపల్ చైర్మన్ డివి, నవభూమి బ్యూరో చీఫ్ తుమ్మలపల్లి ప్రసాద్, స్థానిక వైద్యులు రవికుమార్, ప్రముఖ ఆక్యుపంచర్ వైద్యులు అనిల్ కుమార్, అనువంశిక వైద్యులు డాక్టర్ లక్ష్మణ స్వామి, సభ నిర్వాహకులు లింగాల వెంకన్న, బొమ్మెర ముత్యం తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సుగుణారావు మాట్లాడుతూ సన్మానించిన ఇల్లందు సిద్ధార్థ ఆరోగ్య కేంద్రం వారికి, అతిథులకు కృతజ్ఞతలు తెలియజేశారు. దీంతో ఆల్టర్నేటివ్ థెరపీస్ వ్యాప్తిలో మరింత బాధ్యతగా ఉంటానన్నారు.

## యాదగిరిగుట్ట పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : యాదగిరిగుట్టపట్టణంలో విశ్వహిందూ పరిషత్ మరియు బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిన్న కాశ్మీర్లో చనిపోయినటువంటి హిందువుల ఆత్మకు శాంతి కలగాలని సింహద్వారం దగ్గర నుండి అమరుల స్థూపం వరకు కొవ్వొత్తుల ప్రదర్శన చేయడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు రాఘవుల సాయికిరణ్ మాట్లాడుతూ హిందూ జాతి మీద జరిగిన దాడి అంతేకాకుండా కేవలం ఒక మతం మీద పాకిస్తాన్ ఉగ్రవాలు దాడి జరపడం జరిగింది ఉగ్రవాదానికి మతం లేదు అన్నోళ్లు ఇపుడు ఏం సమాధానం చెప్తారని ప్రషిప్రశ్నించారు కాశ్మీర్ లో ఉన్నటువంటి ఉగ్రముగల కూడా మద్దతు ఉంది మీరు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు ఇట్టి కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు హరీష్, కౌన్సిలర్ గౌలీకర్ రాజేష్, కర్రే ప్రవీణ్, భాను ప్రసాద్, దుసరి ప్రవీణ్, బండి అనిల్, అశోక్, చంద్రమౌళి, కార్తీక్, జిల్లా భాను, మధు, శివ, చందు, అజయ్, అనిల్, శ్యామ్ సుందర్, లెంకలపల్లి శ్రీను, మిర్యాల కృష్ణ, మహేష్, శ్రీశైలం, కిరణ్, శ్రవణ్ పట్టణంలోని యువత, వివిధవర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం నిషేధించినప్పటికీ మెట్రో రైళ్లలో ప్రకటనలు ప్రదర్శించారు

**: హైకోర్టుకు తెలిపిన న్యాయవాది**

- **హైదరాబాద్ మెట్రో రైళ్లలో నిషేధిత బెట్టింగ్ యాప్స్ ప్రకటనలపై హైకోర్టులో పిల్**
- **ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన న్యాయవాది నాగూర్ బాబు**
- **ప్రభుత్వం నిషేధించినా యాప్స్ ప్రకటనలు ఇస్తున్నారని పిటిషనర్ వాదన**
- **2022 తర్వాత ప్రకటనలు లేవని స్పష్టం చేసిన మెట్రో రైలు సంస్థ**
- **కౌంటర్ దాఖలుకు సమయం కోరిన మెట్రో... విచారణ ఏప్రిల్ 29కి వాయిదా**



హైదరాబాద్ నగరంలో సేవలందిస్తున్న మెట్రో రైళ్లలో నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన ప్రకటనలు ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలపై తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. న్యాయవాది నాగూర్‌బాబు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసి, స్వయంగా వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం బెట్టింగ్ యాప్‌లపై నిషేధం విధించినప్పటికీ, హైదరాబాద్ మెట్రో రైళ్లలో మాత్రం వాటి ప్రకటనలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే కొన్ని బెట్టింగ్ యాప్‌ల కార్యకలాపాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ జరుపుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో, మెట్రో రైళ్లలో ఇస్తున్న ప్రకటనల వ్యవహారంపై కూడా సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ (హెచ్ఎంఆర్) తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. 2022 సంవత్సరం తర్వాత మెట్రో రైళ్లలో ఎటువంటి బెట్టింగ్ యాప్ ప్రకటనలను ప్రదర్శించడం లేదని ఆయన ఉన్నత న్యాయస్థానానికి స్పష్టం చేశారు. ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు తమకు కొంత వ్యవధి కావాలని కోర్టును అభ్యర్థించారు. ఇరు పక్షాల ప్రాథమిక వాదనలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, మెట్రో రైలు సంస్థ అభ్యర్థనను మన్నించింది. కౌంటర్ దాఖలు చేయడానికి సమయం ఇస్తూ, తదుపరి విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేసింది.

# హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్

**: భట్టి విక్రమార్క**



హైదరాబాద్: భాగ్యనగరంలో భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క వెల్లడిం చారు. రేపటి నుంచి జరిగే ఈ సమ్మిట్‌కు ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో నిపుణులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచశాంతి, అహింస, న్యాయం, పెట్టుబడులే లక్ష్యంగా ఈ సమ్మిట్ నిర్వ హించనున్నట్లు చెప్పారు. 'ఈ సమ్మిట్‌లో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, నిపుణులకు తెలంగాణ ప్రభుత్వ విజన్ గురించి వివ రిస్తాం. ఇం దిరా మహిళా శక్తి బజార్లు, గ్రామాల్లో ఉపాధి కల్పన తదితర అంశాల గురించి చెబుతాం. ఎకనమిక్ జస్టిస్, పొలిటికల్ జస్టిస్, సోషల్ జస్టిస్, జెండర్ జస్టిస్, యూత్ జస్టిస్, ఎకలాజికల్ జస్టిస్, పీస్ జస్టిస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తాం'' అని మంత్రి తెలిపారు.

## పహల్గాం దాడి ఎఫెక్ట్..
# హైదరాబాద్, ముంబై నగరాల్లో హైఅలర్ట్

- **కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలతో అప్రమత్తమైన పోలీసు శాఖ**
- **హైదరాబాద్‌లో కట్టుదిట్టమైన భద్రత**
- **ముంబై, మహారాష్ట్ర తీర ప్రాంతంలోను భద్రత పెంపు**



జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం సమీపంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో హైదరాబాద్‌తో సహా తెలంగాణ రాష్ట్రంలో హైఅలర్ట్ విధించారు. కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల మేరకు రాష్ట్ర పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

**మహారాష్ట్రలోనూ...**

మహారాష్ట్ర రాజధాని ముంబై నగరంతో పాటు దాని తీర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు పటిష్టం చేసినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు. ఈ దాడి అనంతరం మహారాష్ట్ర హోంశాఖ అప్రమత్తమైంది. సముద్ర మార్గంలో నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని ముంబై పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ముంబై తీర ప్రాంతంలో భద్రతను పెంచారు.

## అఖిలపక్ష భేటీకి
# అన్ని పార్టీలను ఆహ్వానించాలి

**: అసదుద్దీన్ ఒవైసీ**



హైదరాబాద్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. ఈ భేటీపై బుధవారం రాత్రి కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుతో మాట్లాడానని, ఐదు నుంచి 10 ఎంపీలున్న పార్టీలతో భేటీ యోచన ఉన్నట్లు చెప్పారని అన్నారు. ''తక్కువ ఎంపీలున్న పార్టీలను ఎందుకు ఆహ్వానించరని అడిగా. అందర్నీ పిలిస్తే భేటీకి ఎక్కువ సమయం పడుతుందని చెప్పారు. ఇది కేవలం భాజపా లేదా ఇతర పార్టీల అంతర్గత భేటీ కాదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అఖిలపక్ష భేటీ అనే గట్టి సందేశం ఇవ్వాలి. అఖిలపక్షాల సూచనలకు ప్రధాని మరో గంట సమయం కేటాయించలేరా? మీ సొంత పార్టీకి పూర్తి మెజార్టీ లేదు. ఇది కేవలం రాజకీయ అంశం కాదు.. జాతీయ సమస్య. నిజమైన అఖిలపక్ష భేటీ నిర్వహించాలని మోదీని కోరుతున్నా. పార్లమెంట్‌లో ఎంపీలున్న అన్ని పార్టీలను భేటీకి ఆహ్వానించాలి'' అని అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు.

# కశ్మీర్ ప్రజలకు వాళ్లు తిండి లేకుండా చేశారు

## : బీఆర్ఎస్ నేత వినోద్ కుమార్ ఆగ్రహం

- **ఫిబ్రవరి నుంచి జులై వరకు కశ్మీరీలకు ధనార్జనకు అవకాశం ఉంటుందని వెల్లడి**
- **దాడి కారణంగా పర్యాటకులు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్న వినోద్ కుమార్**
- **పర్యాటక రంగంపై వేలాది కుటుంబాలు బ్రతుకుతున్నాయని వ్యాఖ్య**



కశ్మీర్ ప్రజలకు ఇది అత్యంత కీలకమైన సమయమని, ధనార్జనకు ఈ సీజనే అనుకూలమని బీఆర్ఎస్ సీనియర్ నేత వినోద్ కుమార్ పేర్కొన్నారు. కశ్మీర్‌లో శీతాకాలం మొత్తం ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుందని ఆయన అన్నారు. ఫిబ్రవరి చివరి నుంచి జులై వరకు పర్యాటక రంగం ద్వారా మాత్రమే కశ్మీరీలు డబ్బు సంపాదించగలరని తెలిపారు. ప్రస్తుతం ఉగ్రవాదులు చేసిన దాడి కారణంగా పర్యాటకులు జమ్ముకశ్మీర్‌కు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన అన్నారు. పర్యాటకులు రాకపోతే కశ్మీరీ ప్రజలకు జీవనోపాధి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో వేలాది సామాన్య కుటుంబాలు పర్యాటక రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. ఇప్పుడు తిండి లేకుండా చేశారని మండిపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు కశ్మీర్‌కు వస్తారని, ఇలాంటి దాడుల వల్ల వివిధ దేశాల నుంచి వచ్చే పర్యాటకులు తగ్గిపోతారని, తద్వారా కశ్మీరీ ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని వినోద్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.



# మౌలిక సదుపాయాలు కల్పించండి..
# విద్యార్థినుల ఆందోళన

హైదరాబాద్: వసతి గృహంలో మౌలిక సదుపాయాలు లేవంటూ కోఠిలోని 'వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ' విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఉపకులపతి ఛాంబర్ ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. హాస్టల్‌లో మంచినీరు, మరుగుదొడ్లు సరిగా లేవని, క్యాంపస్‌లో పాములు తిరుగుతున్నాయని, ఎలుకలు, కుక్కలు కొరుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల నుంచి ఆందోళన చేస్తున్నా వీసీ (ఉపకులపతి) పట్టించుకోవడం లేదని, సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని చెబుతున్నారు.

## ఎర్రబెల్లి దయాకరరావుకు షాక్..
# కాంగ్రెస్‌లో చేరిన సన్నిహితుడు!

- **కాంగ్రెస్‌లో చేరిన సోమేశ్వరరావు, పలువురు మాజీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు**
- **కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**
- **కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**



బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర రావుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య బీఆర్ఎస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో ఎర్రబెల్లి దయాకర రావు సన్నిహితుడు సోమేశ్వర రావు, పలువురు మాజీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సువాసనల గుత్తి గన్నేరు..!

**ఐదు రేకలతో ఆహ్లాదకరమైన గులాబీ, తెలుపు రంగు ఛాయలతో... చక్కటి సువాసన వెదజల్లే పూల మొక్క గుత్తి గన్నేరు. మరి దీన్ని మనం ఇంటి ముందు ఎలా పెంచుకోవాలో తెలుసా?**

గుత్తి గన్నేరు పూల మొక్కనే పింక్ గార్డేనియా, ష్రబ్ వింకా, గుత్తి గన్నేరు అని చాలా పేర్లతో పిలుస్తారు. దీని శాస్త్రీయనామం కోప్సియా ఫ్రూటికోసానే. ఆకృతి, రంగు, సువాసనలతో ఆకర్షించే ఇది అలంకరణ మొక్కగా చాలా పాపులర్. మొగ్గలు పింక్ కలర్‌లో వచ్చినా విచ్చుకున్నాక లేత గులాబీ, తెలుపు ఛాయల్లోకి మారతాయి. ఆకులు ముదురాకుపచ్చ రంగులో లెదర్ లుక్‌లో మెరిసిపోతాయి. పింక్ గార్డేనియాకు ఔషధ గుణాలతో పాటు గాలిని శుద్ధి చేసే శక్తి ఉందట. ముఖ్యంగా హానికారక రసాయనాలు, టాక్సిన్లను తొలగిస్తుంది.





**కుండీల్లోనూ ఎదుగుతుంది...**

ఈ మొక్క చక్కగా ఎదగాలంటే పూర్తి సూర్యకాంతిని అందించాలి. పాక్షికంగా నీడ ఉన్నా పరవాలేదు. కరవు నేలల్లోనూ బాగానే పెరుగుతుంది. నీళ్లు రోజూ పోయాలి... కానీ, మరీ బురదగా కాకుండా చూసుకోవాలి. కుండీల్లో పెంచుకునేటప్పుడు నీరు నిలవని సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. ఇది సుమారు 6-10 అడుగుల ఎత్తువరకూ పెరుగుతుంది. అయితే, ఇది కాస్త నెమ్మదిగా ఎదిగే రకం. సరైన పోషణ అందిస్తే మాత్రం రెండో ఏడాది నుంచే పూలను ఇస్తుంది. ఎండిన, విరిగిన కొమ్మల్ని ఎప్పటికప్పుడు కత్తిరిస్తే పూలు మరింత ఎక్కువగా విరబూస్తాయి. వేరు తెగులు, స్పైడర్ మైట్, అపిడ్స్... వంటి చీడపీడలు వచ్చే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన మొక్కల భాగాలను కత్తిరించి తీసేయాలి. వేపనూనెను పిచికారీ చేసినా మంచిదే!





# మొక్కలకు ఇవి సాయం చేస్తాయి!

**వేసవి సెలవులిచ్చారు. పిల్లలను రవళి ఊరికి తీసుకెళ్లాలి. ఇంట్లో ఎవరూ లేకపోతే బాల్కనీ, పెరటి మొక్కలకు నీళ్లెలా... అనే సమస్య ఎదురైందామెకు. అలాగని మొక్కలను ఎండకొదిలేసి వెళ్లాలంటే మనసు రావడంలేదు. దీనికి పరిష్కారాన్నిచ్చేవే ఈ 'ప్లాంట్ పాటర్స్'.**














**ఇండోర్‌లో...**

నీడ పట్టున నీటిలో పెంచే మనీప్లాంట్‌కైతే వారానికి సరిపడా నీటిని అందిస్తే సమస్య ఉండదు. అదే పుదీనా, స్నేక్‌ప్లాంట్ వంటి మట్టిలో పెరిగే ఇండోర్ మొక్కలకు రెండుమూడు రోజులకొకసారైనా నీటిని అందించాలి. ఇటువంటి మొక్కలకు ఉపయోగపడేలా టెర్రకోట వాటరింగ్ ప్లాంటర్స్, సెల్ఫ్‌వాటరింగ్ స్పైక్స్ అంటూ ఇప్పుడు మార్కెట్‌లో, ఆన్‌లైన్‌లో దొరుకుతున్నాయి. ఇవి రెండు భాగాలుగా ఉంటాయి. తొట్టెలోని మొక్క మొదళ్లలో గుచ్చడానికి వీలుగా అడుగుభాగం, అలాగే నీటిని నింపడానికి రెండోభాగం వీలుగా ఉంటాయి. నీటితో నింపిన ఈ స్పైక్స్‌ను తొట్టెలో మొక్కకు పక్కగా మట్టిలో గుచ్చితే చాలు. ఈ ఆటోమేటిక్ ప్లాంట్ వాటరింగ్ డివైస్‌లు మొక్కకు కావాల్సినంతమేరకు నీటిని అందిస్తుంటాయి. దీనివల్ల మొక్కలు వారంరోజులపాటు ఎండకు గురికావు.

**బాల్కనీలో...**

ఇక్కడ ఉంచే మొక్కలకు పాక్షికంగా లేదా పూర్తిగా ఎండ తగులుతూ ఉంటుంది. దీంతో మట్టి పొడారుతూ ఉంటుంది. వీటికని ప్రత్యేకంగా మంచినీటి మట్టికుండ ఆకారంలో మెడ పొడవుగా ఉండే 'వాటరర్స్' వస్తున్నాయి. తొట్టెలో మొక్కలకు పక్కగా సగానికిపైగా దీన్ని పాతిపెట్టి నీటితో నింపితే చాలు. వీటి నుంచి వచ్చే చెమ్మదనం మొక్కలను ఎండ నుంచి తట్టుకునేలా సాయపడుతుంది. ప్రతి తొట్టెలో ఒక వాటరర్‌ను ఉంచితే కనీసం వారం రోజులపాటు విడిగా నీటిని అందించే అవసరం ఉండదు. అలాగే త్రికోణం ఆకారంలో పొడవుగా ఉండే వాటరర్స్ కూడా బయటి మొక్కలకు ఉపయోగపడతాయి. మొదట సూదిగా ఉండే వాటరర్ భాగాన్ని మొక్కకు పక్కగా తొట్టెలో గుచ్చాలి. ఆ తర్వాత నీటితో నింపిన సీసా మూతకు చిన్న రంధ్రం చేసి ఈ వాటరర్‌లో బోర్లించినట్లు ఉంచితే మొక్కకు తగినంత నీరు అందుతూ ఉంటుంది. ఈ వేసవిలో మొక్కలకు సాయం అందించే ఇవన్నీ మీకూ చేయూతే కదా!



## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. మెటల్, ఫార్మా మినహా అన్నిరంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ 315.06 పాయింట్లు పతనమై.. 79,801.43 వద్ద ముగిసింది. నిఫ్టీ 82.25 పాయింట్లు తగ్గి 24,246.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 ఇండెక్స్ దాదాపు 3శాతం, నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 7 శాతం పెరిగింది. తొలి గంటలో ఫ్లాట్‌గా మొదలైన సూచీలు.. ఆ తర్వాత మిగతా అన్ని సెషన్లలోనూ ప్రతికూలంగా ట్రేడయ్యాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ ఉదయం 80,058.43 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత ఏ దశలోనూ మార్కెట్లు కోలుకోలేదు.

ఇంట్రాడేలో 80,173.92 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 79,724.55 పాయింట్లకు తగ్గింది. చివరకు 315.06 పాయింట్లు పతనమై.. 79,801.43 వద్ద ముగిసింది. నిఫ్టీ 82.25 పాయింట్లు తగ్గి.. 24,246.70 వద్ద స్థిరపడింది. గురువారం ట్రేడింగ్‌లో దాదాపు 1869 షేర్లు లాభపడగా.. 1921 షేర్లు పతనయ్యాయి. నిఫ్టీలో హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, ఐషర్ మోటార్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎటర్నల్ నష్టపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ లాభపడ్డాయి. ఎఫ్ఎంసీజీ, రియాల్టీ ఒక్కొక్కటి ఒకశాతం క్షీణించగా.. ఫార్మా ఇండెక్స్ ఒకశాతం పెరిగింది.

## వడదెబ్బ వల్ల కలిగే వ్యాధులకు ఆయుర్వేదంలోనే చికిత్స..

### పతంజలి పరిశోధనలో తేలిన నిజం!




**న్యూఢిల్లీ:** వేసవి రావడంతో సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. కొంతమంది ఎండలో ఎక్కువసేపు ఉండటం వల్ల వడదెబ్బకు గురవుతారు. సూర్య కిరణాల వల్ల చర్మం మంటగా, ఎర్రగా మారడాన్ని వడదెబ్బ అంటారు. వైద్య పరిభాషలో దీనిని సోలార్ ఎరిథెమా అంటారు. అల్లోపతిలో, ఈ సమస్యను నివారించడానికి సన్‌స్క్రీన్‌ను అప్లై చేయడం మంచిది. ఈ సమస్య తలెత్తితే, అది మందులు, కొన్ని చికిత్సలతో నయమవుతుంది. అయితే, ఈ వ్యాధి లక్షణాలను ఆయుర్వేద సహాయంతో కూడా తగ్గించవచ్చు.

పతంజలి పరిశోధనా సంస్థ, హరిద్వార్, పతంజలి మూలికా పరిశోధన విభాగం నిర్వహించిన పరిశోధనలో ఆయుర్వేదం దాని లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుందని వెల్లడైంది. ఈ పరిశోధన ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ డెర్మటాలజీలో ప్రచురించింది. సాంప్రదాయ, ఆయుర్వేద, మూలికా పద్ధతుల ద్వారా కూడా సోలార్ ఎరిథెమాను నయం చేయవచ్చని పరిశోధన చెబుతోంది. మూలికా నివారణలు, జీవనశైలి మార్పులు సోలార్ ఎరిథెమా లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఆయుర్వేదంలో, ఈ వ్యాధిని కలబంద, నిమ్మకాయ, టమోటాలతో నియంత్రించవచ్చు.

పరిశోధన ప్రకారం, కలబంద ఒక సహజ మాయిశ్చరైజర్, ఇది చర్మాన్ని చల్లబరుస్తుంది. ఉపశమనం కలిగిస్తుంది. టమోటా రసం చర్మ సమస్యలకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది. అదేవిధంగా, దోసకాయ, నిమ్మకాయను పేస్ట్‌గా తయారు చేసి చర్మంపై పూయడం వల్ల వడదెబ్బను తగ్గించడంలో సహాయపడుతుంది. సౌర ఎరిథెమా సంబంధిత సమస్యల వల్ల కలిగే వ్యాధుల చికిత్సకు ఆయుర్వేదంలో అనేక పద్ధతులను ఉపయోగిస్తారు. ఆయుర్వేదం ప్రకారం, పిత్త దోషాల (శోషక, క్లిష్టమైన, జీర్ణ పిత్త దోషాలు) అసమతుల్యత కారణంగా సోలార్ ఎరిథెమా వంటి సమస్యలు సంభవించవచ్చు.

పంచకర్మ చికిత్సను ఉపయోగించి, దోషాలు, ధాతు అసమతుల్యతలను సరిచేయవచ్చు. చర్మ సమస్యలకు చికిత్స చేయవచ్చు. శరీరాన్ని లూబ్రికేషన్, చెమట, వాంతులు, ప్రక్షాళన, రక్తస్రావము ద్వారా శుద్ధి చేయవచ్చు. సూర్యరశ్మిని నివారించడం ద్వారా సోలార్ ఎరిథెమా హానికరమైన ప్రభావాలను తగ్గించవచ్చు.

### సన్‌స్క్రీన్ మీ ఆరోగ్యానికి ప్రమాదకరం

కొన్ని సన్‌స్క్రీన్‌లు ఆరోగ్యానికి ప్రమాదకరమని పరిశోధనలో తేలింది. రసాయన ఆధారిత సన్‌స్క్రీన్‌లలో ఉండే రసాయనాలు హానికరం. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కొన్ని రసాయనాలను ప్రమాదకరమైనవిగా ప్రకటించింది. పరిశోధనలో కొన్ని రసాయనాలు ప్రస్తావించారు. వీటిలో సన్‌స్క్రీన్‌లలో ఉపయోగించే హెూమోసలేట్ అనే రసాయనం ఉంటుంది. కానీ ఇది హార్మోన్ల సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. ఆక్సిబెంజోన్ అనేది సన్‌స్క్రీన్‌లలో ఉపయోగించే ఒక రసాయనం, కానీ ఇది చర్మ అలెర్జీలకు కారణమవుతుందని పరిశోధనల్లో తేలింది.

## వాహనదారులకు శుభవార్త




**న్యూఢిల్లీ:** తొలుత వాణిజ్య వాహనాలకు, 2027 నుంచి వ్యక్తిగత వాహనాలకు అమలు చేయనున్నారు. అప్పటి వరకు మాత్రం టోల్ గేట్లు కొనసాగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. సాధారణంగా మన ఫోన్లలో ఉండే జీపీఎస్ విధానానికి ఈ జీఎన్‌ఎస్‌ఎస్ పూర్తిగా భిన్నం. జీపీఎస్ అనేది ఒకే ఒక్క శాటిలైట్ నేవిగేషన్ వ్యవస్థ. కానీ జీఎన్‌ఎస్‌ఎస్ అనేది పలు దేశాలకు చెందిన నేవిగేషన్ ఉపగ్రహాలతో అనుసంధానమవుతుంది. రష్యాకు చెందిన గ్లోనాస్, యూరప్‌కు చెందిన గెలీలియో, చైనాకు చెందిన బైదు, భారత్‌కు చెందిన గగన్, నావిక్ తదితర నావిగేషన్ వ్యవస్థలు ఉన్నాయి. ఈ వేర్వేరు ఉపగ్రహాలకు ఒకేసారి అనుసంధానమై అత్యంత కచ్చితమైన లొకేషన్ గుర్తింపుతోపాటు నావిగేషన్ పొందే విధానమే జీఎన్‌ఎస్‌ఎస్. ఈ విధానం అమల్లోకి వస్తే వాహనాలు ఏయే రోడ్లపై ఎంతదూరం ప్రయాణించాయన్నది కచ్చితంగా తెలుసుకోవచ్చు. ఈ విధానంలో టోలు అమలు చేసేందుకు బస్సులు, లారీలు, ట్రక్కులు, కార్లు తదితర టోల్ వర్తించే వాహనాల్లో ఓయూబీగా పిలిచే ఆన్‌బోర్డు యూనిట్లను బిగించుకోవాల్సి ఉంటుంది.



# ఆర్సీబీ దూకుడు..

### పాయింట్స్ టేబుల్‌లో టాప్‌లో నిలుస్తుందా?



**బెంగళూరు:** ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలి విజయాన్ని నమోదు చేసింది. అదేంటి ఇప్పటికే ఐదు మ్యాచ్‌లలో గెలిచింది అంటారా? అవును 5 మ్యాచ్‌లలో గెలిచింది.. కానీ అవన్నీ ఇతర వేదికల్లో. కానీ గురువారం మాత్రం ఆ జట్టు తన హెూంగ్రౌండ్ అయిన చిన్నస్వామి స్టేడియంలో విజయం సాధించింది. ఈ టోర్నీలో ఈ మ్యాచ్‌కు ముందు వరకు ఇక్కడ మూడు మ్యాచ్‌లు ఆడిన ఆర్సీబీ.. అన్నింట్లోనూ ఓడింది. కానీ తాజాగా రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించి.. చిన్నస్వామిలో తొలి విజయాన్ని నమోదు చేసింది. 19వ ఓవర్‌లో కేవలం ఒక్క పరుగే ఇచ్చి, రెండు వికెట్లు పడగొట్టి.. మ్యాచ్‌ను మలుపు తిప్పిన హేజిల్‌వుడ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్.. తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో ఆర్సీబీ ఈ వేదికగా వరుసగా నాలుగోసారి ఫస్ట్ బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. అయితే ఆ జట్టులో విరాట్ కోహ్లీ, దేవ్‌దత్ పడిక్కల్ హాఫ్ సెంచరీలతో అదరగొట్టడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 రన్స్ స్కోరు చేసింది. విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 70 రన్స్), పడిక్కల్ (27 బంతుల్లో 50 రన్స్) రాణించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో సందీప్ శర్మ 2 వికెట్లు తీశాడు. ఆర్చర్, హసరంగా ఒక్కో వికెట్ పడగొట్టారు.

అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన రాజస్థాన్ రాయల్స్.. మెరుపు శుభారంభాన్ని అందుకుంది. తొలి బంతినే స్టాండ్స్‌లోకి పంపిన యశస్వి జైశ్వాల్.. తమ ఉద్దేశాన్ని క్లియర్‌గా చెప్పేశాడు. క్రీజులో ఉన్నంతసేపు ఎదురుదాడికి దిగాడు. వైభవ్ సూర్యవంశీ (12 బంతుల్లో 16 రన్స్) భారీ స్కోరు చేయలేకపోయాడు. జైశ్వాల్ (19 బంతుల్లో 49 రన్స్) ధాటిగా బ్యాటింగ్ చేయడంతో.. రాజస్థాన్ రాయల్స్.. 9 ఓవర్లలో 110/2తో నిలిచింది. దీంతో ఈజీగా టార్గెన్‌ను ఫినిష్ చేసేలా కనిపించింది.

కానీ బంతి అందుకున్న కృనాల్ పాండ్యా మ్యాజిక్ చేశాడు. రెండు వికెట్లు తీశాడు. డెత్ ఓవర్లలో జోష్ హేజిల్‌వుడ్ అదరగొట్టాడు. తనెందుకు అంత ప్రత్యేకమో మరోసారి రుజువు చేస్తూ సత్తాచాటాడు. నాలుగు వికెట్లు తీసి.. ఆర్సీబీని గెలిపించాడు. దీంతో రాజస్థాన్ రాయల్స్ చివరకు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 194 రన్స్ స్కోరు చేసింది. ఆర్సీబీ బౌలర్లలో హేజిల్‌వుడ్ 4 వికెట్లు తీయగా.. కృనాల్ పాండ్యా 2 వికెట్లు పడగొట్టాడు. భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్ ఒక్కో వికెట్ చొప్పున తీశారు.

### ఐపీఎల్ పాయింట్ల పట్టికలో 3వ స్థానానికి ఆర్సీబీ

ఆర్సీబీ ఈ విజయంతో 12 పాయింట్లతో ఐపీఎల్ పాయింట్స్ టేబుల్‌లో మూడో ప్లేసుకు దూసుకొచ్చింది. ముంబై ఇండియన్స్ (10 పాయింట్లు) నాలుగో ప్లేసుకు పడిపోయింది. గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా మొదటి, రెండో స్థానంలో కొనసాగుతున్నాయి. ఈ రెండు జట్లకు కూడా 12 పాయింట్లు (నెట్ రన్‌రేట్ మాత్రమే తేడా) ఉన్నాయి.

### పహల్గాం ఉగ్రదాడితో సంబంధం లేకపోతే

# ఎందుకు ఖండించలేదు..!

### పాక్ పీఎంను ప్రశ్నించిన డానిష్ కనేరియా..!



**కరాచీ:** పహల్గాంలో జరిగిన ఇద్దరు విదేశీయులు సహా 26 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే, దాడిపై పాక్ దౌత్యవేత్తలు, క్రికెటర్లు సైతం స్పందించలేదు. కానీ, పాకిస్తాన్ మాజీ లెగ్ స్పిన్నర్ డానిష్ కనేరియా మాత్రం సొంత దేశ ప్రధాని షాబాజ్ షరీఫ్‌ను ప్రశ్నించాడు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో పాకిస్తాన్‌కు సంబంధం లేకపోతే.. షాబాజ్ ఇప్పటివరకు ఎందుకు ఖండించలేదని నిలదీశారు. పహల్గాం ఉగ్రవాద దాడిలో పాక్ పాత్ర లేకపోతే షెహబాజ్ షరీఫ్ ఇంకా దానిపై ఎందుకు స్పందించలేదు? అకస్మాత్తుగా సైన్యాన్ని ఎందుకు అప్రమత్తంగా ఉంచారు? ఎందుకంటే నిజం ఏమిటో మీకు తెలుసు. మీరు ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ మద్దతు ఇస్తున్నారు. మీరు సిగ్గుపడాలి' డానిష్ కనేరియా ఘాటుగా స్పందించాడు. కనేరియా ట్వీట్‌పై ఓ నెటిజన్ స్పందించాడు. 'పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో ఉగ్రవాదాన్ని భారతదేశం స్పాన్సర్ చేస్తోంది. బహుశా భారత రా బృందం కర్మ నుంచి పాఠం నేర్చుకోవచ్చు' అంటూ కామెంట్ చేశాడు. దీనికి కరేనియా బదులిస్తూ 'బలూచ్ ప్రజల బాధలకు కారణమైన వారి పక్షాన నిలబడటానికి మీరు సిగ్గుపడాలి. భారతదేశంపై తప్పుడు ఆరోపణలు వ్యాప్తి చేయడానికి మీరు సిగ్గుపడాలి. మీరు సమాజ విలువలకు ప్రాతినిధ్యం వహించరు. ఏ రూపంలోనైనా ఉగ్రవాదాన్ని సమర్థించడం అవమానకరమైనది' అంటూ బదులిచారు. మరో ట్వీట్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు స్థానిక కశ్మీరీలను ఎందుకు టార్గెట్ చేయరని ప్రశ్నించాడు. హిందువులే లక్ష్యంగా ఎందుకు దాడులకు తెగబడతారని మండిపడ్డాడు. ఉగ్రవాదం కారణంగా యావత్ ప్రపంచం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించాడు.

మరో ట్వీట్‌లో తాను ఏదైనా ట్వీట్ చేసినప్పుడల్లా కొందరు భారతీయ ముస్లింలు ఎందుకు బాధపడతారని నిలదీశాడు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, సెనేటర్ బిల్ హాగెర్టీ ట్వీట్‌లను రీట్వీట్ చేశారు. అయితే, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా మాజీ లెగ్ స్పిన్నర్ పోస్టులు పెట్టడంపై ఓ నెటిజన్ ప్రశ్నలు సంధించాడు. 'మీరు ఎక్కడి నుంచి వచ్చారో నాకు అర్థం కాలేదు. పాక్ తరపున ఆడుతారు. పాక్ క్రికెట్ ద్వారా పేరు సంపాదించాడు.

### టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌కు

# చంపుతామంటూ బెదిరింపులు



**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా ప్రధాన కోచ్, బీజేపీ మాజీ ఎంపీ గౌతమ్ గంభీర్‌కు బెదిరింపులు వచ్చాయి. తనను చంపుతామంటూ ఐసిస్ కశ్మీర్ నుంచి రెండు మెయిల్స్ వచ్చాయని ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతోపాటు కుటుంబ సభ్యులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ నెల 22న గంభీర్‌కు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఒక మంగళవారం మధ్యాహ్నం రాగా, మరొకటి అదేరోజు సాయంత్రం వచ్చింది. రెండిటిలోనూ ఐ కిల్ యూ అని ఉంది. ఈ నేపథ్యంలో కేసు నమోదుచేసిన ఢిల్లీలోని రాజింద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంభీర్‌కు ఇలాంటి బెదింపులు రావడం ఇది మొదటిసారి కాదు. 2021, నవంబర్‌లో ఆయన ఎంపీగా ఉన్న సమాయంలో కూడా ఇలాంటి ఈ-మెయిల్ వచ్చింది. కాగా, మంగళవారం పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిని గంభీర్ ఎక్స్‌వేదికగా ఖండించారు. ఈ దాడిలో ఇప్పటివరకు 26 మంది చనిపోయిన విషయం తెలిసిందే.

# భవిష్యత్‌లోనూ పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడబోం..

### పహల్గాం దాడి నేపథ్యంలో బీసీసీఐ కఠిన నిర్ణయం..!



**న్యూఢిల్లీ:** పహల్గాంలో ఉగ్రదాడి ఘనత తర్వాత బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకున్నది. పాకిస్తాన్‌తో ఇకపై ఎలాంటి ద్వైపాక్షిక ఆడబోదని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు. 2012-13 నుంచి భారత్-పాకిస్తాన్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లో జరుగడం లేదు. చివరిసారిగా 2008లో బారత జట్టు పాకిస్తాన్‌లో పర్యటించింది. ప్రస్తుతం ఐసీసీ, ఏసీసీ టోర్నమెంట్‌ల సమయంలో మాత్రమే ఇరుజట్లు తలపడుతున్నాయి. పాకిస్తాన్ చివరిగా 2023 వన్డే ప్రపంచకప్ సందర్భంగా భారత్‌ను సందర్శించింది. అయితే, 2025 చాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్తాన్‌కు వెళ్లేందుకు భారత్ నిరాకరించింది. ఈ తర్వాత భారత జట్టు మ్యాచులన్నీ దుబాయి వేదికగా జరిగాయి. ఓ స్పోర్ట్స్ సంస్థతో రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. హహల్గాం ఉగ్రదాడిని ఖండించారు. తమ ప్రభుత్వం ఏది చెప్పినా చేస్తామన్నారు. ప్రభుత్వ వైఖరిని దృష్టిలో పెట్టుకొని పాకిస్తాన్‌తో సిరీస్‌లు ఆడడం లేదని.. భవిష్యత్‌లోనూ పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక మ్యాచులు జరుగవన్నారు. ఐసీసీ ఈవెంట్లలో మాత్రం ఆడాల్సి వస్తుందన్నారు. అయితే, ఏం జరుగుతుందో ఐసీసీకి తెలుసునని.. వారు సైతం సహకరిస్తారని ఆశిస్తున్నామన్నారు.

ఉగ్రదాడి ఘటనపై బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా సైతం విచారం వ్యక్తి చేశారు. భయంకరమైన ఉగ్రదాడిలో అమాయక ప్రజలు మరణించడంపై అందరినీ బాధకు గురి చేసిందన్నారు. దారుణమైన, పిరికిపంద చర్యను బీసీసీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటిస్తూ.. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్తిస్తున్నానన్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో సన్‌రైజర్స్-ముంబయి ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉగ్రదాడి మృతులకు బీసీసీఐ నివాళులర్పించింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు 60 సెకన్ల పాటు మౌనం పాటించారు. టాస్ సమయంలో ఇరు జట్ల కెప్టెన్లు తమ సంతాపాన్ని ప్రకటించారు. ఈ దారుణమైన చర్యను తీవ్రంగా ఖండించారు. ఆటగాళ్లు, మ్యాచ్ అధికారులు, కామెంటేటర్స్, సహాయక సిబ్బంది అందరూ నల్లటి బ్యాండ్‌లను ధరించారు. ఇక ఈ మ్యాచ్‌ను బీసీసీఐ ఎలాంటి ఆర్భాటాలు లేకుండానే నిర్వహించింది. మ్యాచ్‌కు చీర్‌లీడర్స్‌ను దూరం పెట్టింది. అలాగే, ఫైర్‌క్రాకర్స్, మ్యూజిక్, డీజేలను సైతం ఏర్పాటు చేయలేదు.



## ఫస్ట్ లుక్‌తోనే భయపెట్టిస్తున్న కాళాంకి భైరవుడు

**టాకీస్:** శ్రీరాముడింట శ్రీకృష్ణుడంట, నివాసి చిత్రాల తర్వాత గాయత్రి ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న చిత్రం 'కాళాంకి భైరవుడు'. హారర్, థ్రిల్లర్ జోనర్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో రాజశేఖర్ వర్మ, పూజా కిరణ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. వి.హరిహరణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కేఎన్ రామారావు, శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను రాజశేఖర్, జీవిత లాంఛ్ చేశారు. ఈ ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో హీరో కాగడా పట్టుకుని వెళ్తున్నట్లు ఉండగా.. చుట్టూ పుర్రెలు, వెనుక పొట్టేలు ఉండి భయంకరంగా ఉంది. ఫస్ట్ లుక్ లాంచింగ్ సందర్భంగా సినిమా నిర్మాతలు మాట్లాడుతూ.. హారర్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. దాదాపు షూటింగ్ మొత్తం పూర్తయ్యిందని, పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. అతి త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తామని చెప్పారు. కాగా, కాళాంకి భైరవుడు చిత్రంలో ఆమని, రితిక చక్రవర్తి, నాగ మహేశ్, బలగం జయరాం, భవ్య, మహమ్మద్ బాషా, బిల్లి మురళి ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు.

# రాజాసాబ్ విడుదలపై తొలగని సందిగ్ధత



**టాకీస్:** 'బాహుబలి' మూవీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ప్రభాస్ రెంజ్.. క్రేజ్ ఎలా పెరిగిపోయిందో చెప్పక్కర్లేదు. కానీ, ఆ తర్వాత వచ్చిన సినిమాలు నిరాశనే మిగిల్చాయి. ఇక 'సలార్' హిట్ తో ఖుషీలో ఉన్న ఆయన ఫ్యాన్స్.. 'కల్కి 2898 ఏడీ' సినిమా భారీ విజయం సాధించడంతో పండగ చేసుకున్నారు. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో వరుస ప్రాజెక్టులు ఉన్నాయి. 'రాజాసాబ్', దర్శకుడు సందీప్ రెడ్డి వంగ తో 'స్పిరిట్', 'కల్కి 2898 ఏడీ పార్ట్ – 2' ఇలా వరుస పెట్టి చూసుకుంటే అరడజను పైనే సినిమాలు లైన్ లో పెట్టాడు ప్రభాస్. అయితే ఇందులో విడుదలకు సిద్ధంగా ఉన్న మూవీ అంటే 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్నా ఈ మూవీని పూర్తి హార్రర్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు మేకర్స్. దీంతో ఇప్పటికే ప్రేక్షకులో ఈ మూవీ పై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ప్రభాస్ సరసన మాలవిక మోహన, నిధి అగర్వాల్ నటిస్తున్నారు. ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుంది. కానీ ఇప్పటి వరకు రిలీజ్ డేట్ మాత్రం ప్రకటించలేదు. గతంలో ఏప్రిల్ 10న ఈ సినిమాను రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. కానీ, ఈ సినిమా పనుల్లో ఆలస్యం అవుతుండటంతో ఈ మూవీ రిలీజ్ వాయిదా పడింది. అయితే, తాజాగా ఈ సినిమా రిలీజ్‌పై దర్శకుడు మారుతి ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చారు. ఓ ఆటోరిక్షాపై రాజాసాబ్‌లోని ప్రభాస్ ఫోటో ఉండటాన్ని ఆయన తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోకు ఆయన 'అలర్ట్.. వేడి గాలులు మే లో మరింత పెరగనున్నాయి' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. దీంతో త్వరలోనే 'రాజా సాబ్' నుంచి ఓ సాలిడ్ అప్డేట్ అయితే రానుందని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




## ప్రకృతిలో శ్రీయా అందాల విందు..

టాకీస్: సీనియర్ నటి శ్రీయా శరన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. తన నటన ,అందంతో ఎంతో మంది మదిని దోచుకుంది ఈ చిన్నది. ప్రస్తుతం సినిమాలు ఎక్కువ చేయకపోయినా, సోషల్ మీడియా ద్వారా మాత్రం ఎప్పుడూ తన అభిమానులకు అందాల విందు భోజనం పెడుతుంది. తాజాగా ఈ చిన్నది ప్రకృతిలో తన తన అందాలతో కుర్రకారును మాయ చేసింది.

టాలీవుడ్ సీనియర్ నటి శ్రియా శరన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన అతి కొద్ది సమయంలో మంచి ఫేమ్ సంపాదించుకుంది ఈ ముద్దుగుమ్మ. తెలుగు స్టార్ హీరోల అందరి సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఒకప్పుడు వరస సినిమాలతో టాలీవుడ్ నే షేక్ చేసింది ఈ చిన్నది. తర్వాత వివాహం, ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. మళ్లీ సెకండ్ హిన్నింగ్స్ స్టార్ట్ చేసిన ఈ అమ్మడు ఇప్పుడిప్పుడే పలు సినిమాల్లో అవకాశాలు అందుకుంటుంది. ఇక సినిమాల పరిస్థితి ఎలా ఉన్నా ఈ అమ్మడు సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటూ ఎప్పుడూ తన గ్లామర్ ఫొటోలతో సందడి చేస్తుంటుంది. తాజాగా ఈ బ్యూటీ పింక్ కలర్ డ్రెస్ లో అందాలతో మాయ చేసింది. పచ్చని చెట్ల మధ్య గులాబీ రంగు డ్రెస్ లోగ్లామర్ ట్రీ ట్ ఇస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ చిన్నది. ఎక్కువగా తన ఫ్యామిలీ ఫొటోలను షేర్ చేస్తూ ఉండేది. కానీ ఈ మధ్య గ్లామర్ ఫొటోలు షేర్ చేస్తూ కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తుంది. వీటిని చూసిన ఈ అమ్మడు అభిమానులు, బ్యూటిఫుల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# బీచ్‌లో అందాల తారా మౌనిరాయ్..

**టాకీస్:** అందాల తారా మౌనీ రాయ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అందం, అభినయం ఈ బ్యూటీ సొంతం. ఈ అమ్మడు బుల్లితెరపై పలు సీరియల్స్ చేస్తూ మంచి ఫేమ్ సంపాదించుకుని, సిల్వర్ స్క్రీన్ పైకి ఎంట్రీ ఇచ్చింది. పలు సినిమాలతో బిజీగా ఉన్న ఈ బ్యూటీ ప్రస్తుతం వెకేషన్ ఏంజాయ్ చేస్తుంది. దానికి సంబంధించిన ఫొటోలు నెట్టింట్లో షేర్ చేయడంతో అవి తెగ వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ నటిగా మంచి పాపులారిటీ సంపాదించుకున్న చిన్నది మౌనీ రాయ్ . స్టార్ నటీ నటులతో సమానంగా ఈ అమ్మడుకు క్రేజ్ సంపాదించుకుది అనడంలో అతిశయోక్తి లేదు. అంతలా తన నటన, గ్లామర్ తో అందరినీ ఫిదా చేసింది. ఇక ప్రస్తుతం పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉండే ఈ బ్యూటీ ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. నాగిన్ సీరియల్ ద్వారా హిందీలో తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. తర్వాత నాగినీ సీరియల్ ద్వారా తెలుగు బుల్లితెరపైకి ఎంట్రీ ఇచ్చి తన అందంతో యూత్ క్రష్ గా మారిపోయింది. అంతే కాకుండా ఈ బ్యూటీ బుల్లితెరపై ఉన్న ఫేమ్ తో సిల్వర్ స్క్రీన్ పైకి ఎంట్రీ పలు సినిమాల్లో కీలక పాత్రల్లో నటించింది. ఆలియా,రన్ భీర్ కపూర్, నాగార్జున నటించిన బ్రహ్మాస్త్రం సినిమాలో ఈ బ్యూటీ కీలక పాత్రలో నటించి తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. ఇక ప్రస్తుతం పలు సినిమాల్లో నటిస్తున్న మౌనిరాయ్ వెకేషన్ ఏంజాయ్ చేస్తుంది. దీనికి సంబంధించినఫొటోలు ఈ బ్యూటీ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఇవి తెగ వైల్ అవుతున్నాయి. బీచ్ లో సన్ రైజ చూస్తూ ఎంజాయ్ చేస్తుంది.




## టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్న ధనశ్రీ వర్మ

**టాకీస్:** భారత క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ మాజీ భార్య, ప్రముఖ కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మ త్వరలో టాలీవుడ్‌లో అడుగుపెట్టబోతుంది. ధనశ్రీ వర్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఆకాశం దాటి వస్తావా. ఈ సినిమాకు శశికుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. నిర్మాత శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మిస్తున్నారు. కొరియోగ్రాఫర్ యష్ ఈ చిత్రంలో కథానాయకుడిగా నటించబోతుండగా.. మలయాళ నటి కార్తీక మురళీధరన్ కీలక పాత్రలో నటిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుండగా.. ఈ సినిమాతోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుంది ధనశ్రీ వర్మ. యుజ్వేంద్ర చాహల్‌తో విడాకుల అనంతరం కెరీర్‌పై ఫోకస్ పెట్టిన ఈ అమ్మడు ప్రస్తుతం వరుస సినిమాలకు సైన్ చేస్తుంది ఇందులో భాగంగానే ఆకాశం దాటి వస్తావా సినిమాకు ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. ఇందులో ధనశ్రీ డ్యాన్సర్‌గా కనిపించబోతుంది.




## పాకిస్థాన్ నటులపై భారత్‌లో నిషేధం..

### 'అబీర్ గులాల్' సినిమాపై కేంద్రం బ్యాన్

**టాకీస్:** జమ్మూ కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పహల్గాంలో ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన పర్యటకులపై సోమవారం మధ్యాహ్నం ఉగ్రవాదులు దాడి జరిపిన విషయం తెలిసిందే. ఈ నరమేధంలో 28 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడితో కశ్మీర్‌లోయతోపాటు దేశంమొత్తం భగ్గుమంది. ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా కేంద్రం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇదిలావుంటే ఈ ఘటన అనంతరం పాకిస్థాన్‌కి చెందిన నటులపై భారత ప్రభుత్వం నిషేధం విధించినట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన వార్తలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

పాకిస్తానీ నటుడు ఫవాద్ ఖాన్ 9 ఏండ్ల తర్వాత మళ్లీ బాలీవుడ్‌లో రీ ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ నటి వాణీకపూర్, పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'అబీర్ గులాల్'. ఈ సినిమా మే 09న ప్రేక్షకుల ముందుకు రానుండగా.. ఇందులో పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్ హీరోగా నటిస్తుండడంతో మూవీని కేంద్రప్రభుత్వం బ్యాన్ చేసినట్లు తెలుస్తుంది. అలాగే పాకిస్థాన్‌కి చెందిన నటులపై భారత్‌లో నిషేధం విధించబోతున్నట్లు సమాచారం. ఇటీవలే ఈ మూవీ నుంచి రెండు పాటలను చిత్రయూనిట్ విడుదల చేయగా.. తాజాగా వాటిని యూట్యూబ్‌లో నుంచి మేకర్స్ తొలగించారు.



## నేను పక్కా భారత్ మూలాలున్న వ్యక్తినే

### ప్రభాస్ మూవీ హీరోయిన్ ఇమాన్వీ స్పష్టం

టాకీస్: కాశ్మీర్‌లో జరిగిన మారణకాండ మీద ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్తాన్ నటీనటులను మన సినిమాల్లో నటింపజేయకూడదంటూ ఒక డిమాండ్ వినిపిస్తోంది. అందులో ముఖ్యంగా ప్రభాస్, హను రాఘవపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా మీద ఆ ఎఫెక్ట్ పడే అవకాశాలున్నాయి. ఎందుకంటే ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న ఇమాన్వీ పాకిస్తాన్ మూలాలు ఉన్న వ్యక్తి. ఆమె తండ్రి గతంలో పాకిస్తాన్ మిలిటరీలో పనిచేశారని, ప్రస్తుతం అమెరికాలో సెటిల్ అయిన ఆమె ప్రభాస్ హీరోయిన్‌గా నటిస్తోందని ప్రచారం జరుగుతోంది. ఇక ఈ ఘటన మీద ఆమె తాజాగా సోషల్ మీడియా వేదికగా స్పందించింది. జరిగిన దారుణం గురించి స్పందిస్తూ, కాశ్మీర్ ఘటనలో బాధితులైన వారందరికీ ఆమె సంతాపం వ్యక్తం చేసింది. ఇలాంటి వైలెన్స్ ను తాను ఖండిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. అలాగే, తన ఫ్యామిలీ గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం గురించి స్పందిస్తూ, 'మా కుటుంబం నుంచి ఎవరికీ పాకిస్తాన్ మిలిటరీతో సంబంధం లేదు. ఈ విషయం ఎలా పుట్టుకొచ్చిందో తెలియదు, కానీ ఈ విషయం సహా ఎన్నో విషయాలు నా గురించి తప్పుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నాయి. ఇంకా బాధించే విషయం ఏమిటంటే, బాధ్యత కలిగిన జర్నలిస్టులు, మీడియా అవుట్‌లెట్‌లు కూడా సోషల్ మీడియాని ఫాలో అవుతున్నారు కానీ నిజానిజాలు ఖరారు చేసుకుని స్పందించడం లేదు.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.